నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మెదక్
శనివారం | 05 అక్టోబర్ 2024 | www.navatelangana.com

ఉచిత న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ

నవతెలంగాణ-సంగారెడ్డి



ఉచిత న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కు సంప్రదించవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.భవాని చంద్ర శుక్రవారం తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ ఉత్తర్వులు ప్రకారం ఈ అవకాశాన్ని కల్పించినట్లు జిల్లా న్యాయ సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. భవాని చంద్ర తెలిపారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూ ఢిల్లీ వారు అందరికి సమన్యాయం అందాలనే ఉద్దేశంతో దేశవ్యాప్తంగా ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. ఎవరైనా ఉచిత న్యాయ సహాయం కావాల్సిన వారు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 15100 కి ఫోన్ చేసి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు.

డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

నవతెలంగాణ-సదాశివపేట



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. శుక్రవారం సదాశివపేట పట్టణంలో సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరి క్రాంతి మాట్లాడుతూ సర్వే సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు నమోదు చేయాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమా, తహశీల్దార్ సరస్వతి, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సహారా హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-వట్‌పల్లి

సహారా హాస్పిటల్ ఆధ్వర్యంలో వట్‌పల్లి మండల కేంద్రంలో ఏఎస్ఐ గయాజుద్దీన్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ గయాసుద్దీన్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన ఆసుపత్రి యాజమాన్యానికి అభినందించారు. ఈ కార్యక్రమంలో సహారా మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శంకర్ మఠం, న్యూరో ఫిజిషియన్ డాక్టర్ దీమాత్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రేయ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

హెూటల్‌ను ప్రారంభించిన నీలం మధు



నవతెలంగాణ-గుమ్మడిదల

మండల పరిధిలోని బొంతపల్లి పారిశ్రామిక వాడలో నూతన హెూటల్‌ను మెదక్ పార్లమెంట్ ఇంచార్జ్ నీల మధు ముదిరాజ్ శుక్రవారం ప్రారంభించారు పారిశ్రామికవాడలో ఎలాంటి హెూటల్ సౌకర్యం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేయోభిలాషి కార్యకర్త అభిశెట్టి నాగరాజు రాఘవేంద్ర భవన్ పేరుతో భోజనం, బిర్యానీ తదితర వంటకాలు తయారు చేసే హెూటల్‌ను ప్రారంభించినందుకు హెూటల్ యాజమాన్యం కుటుంబ సభ్యులతో కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు మాజీ సర్పంచ్ మ్యకం తిరుమల వాసు, దర్గా బిక్షపతి, నర్సింలు, బిక్షపతి రెడ్డి, సురభి కుమార్ గౌడ్, గ్యారాల మల్లేష్, కుమ్మరి వెంకటేష్, ఎజాస్ పాషా, ఎండి హుస్సేన్, నారాయణరెడ్డి, గోపాల్, వీరేశం, నర్సింలు, వెంకట్ రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

జిఎంఆర్ కాలనీలో మెడికల్ క్యాంపు



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం మండల పరిధిలోని కాజిపల్లి పారిశ్రామిక పంచాయతీ పరిధిలోని స్థానిక జిఎంఆర్ కాలనీలో శుక్రవారం ఆర్కే ఫౌండేషన్ ఆర్‌విఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో స్థానికుల పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వైద్య బృందం వివిధ రకాలైన పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే ఫౌండేషన్ చైర్మన్ అడ్వకేట్ దండే రమాకాంత్ బృందం, స్థానిక నాయకులు యువకులు గ్రామస్తులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

గుర్తింపు పొందిన జర్నలిస్టుల వివరాలు అందజేత



నవతెలంగాణ-గుమ్మడిదల :

జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వ గుర్తింపు పొంది అక్రిడిటేషన్ కలిగి ఉన్న జర్నలిస్టులకు మాత్రమే అధికారిక సమాచారాలను అందించాలని, అదేవిధంగా మీడియా పేరుతో వరుస అకృత్యాలకు పాల్పడుతున్న కొందరు వ్యక్తులపై తగిన విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం గుమ్మడిదల మండల జర్నలిస్టులు అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం గుమ్మడిదల డిప్యూటీ తహశీల్దార్ కర్ణాకర్ రావు, ఎస్సై మహేశ్వర్ రెడ్డి తో పాటు ఇతర ప్రభుత్వ అధికారులను కలిసి జర్నలిస్టులు వృత్తిపరంగా ఎదురవుతున్న సమస్యలను విన్నవించి సహకరించాలని అధికారులను కోరారు. దీనికి ఆయా శాఖల అధికారులు సానుకూలంగా స్పందించి తమ పూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల వివరాల లిస్టును అధికారులకు స్వయంగా పటాన్‌చెరు నియోజకవర్గ అర్హులైన అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు కలిసి అందజేశారు. కార్యక్రమంలో ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- అనుమతి లేని నిర్మాణాలు మండలంలో నిత్యకృత్యమయ్యాయి.





నవతెలంగాణ-కొండాపూర్

అనుమతి లేని నిర్మాణాలు మండలంలో నిత్యకృత్యమయ్యాయి. డిటిసిపి పర్మిషన్ మాత్రమే తీసుకొని బహుళ అంతస్తులు, ప్రహరీ గోడలు, గేట్ల నిర్మాణాలు చేపడుతూ.. వాటికి పాటించాల్సిన నిబంధనలను తుంగలో తొక్కేచేస్తున్నారు. గ్రామ, మండల స్థాయిలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారా! లేక ఒత్తిడిలో పనిచేస్తున్నారా! తెలియని పరిస్థితి దాపురించింది. విషయానికొస్తే మండలంలోని మాందాపూర్ గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 101,104,105,125, 126,127,128,129 లో ఉన్న ఒక వెంచర్లో ఎలాంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు, ప్రహరి గోడలు,పెన్సింగ్, వెంచర్ అక్రమ నిర్మాణం యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. నిబంధనల ప్రకారం వ్యవసాయ భూమిని నాలా కన్వెన్షన్ చేసుకుని, గ్రామపంచాయతీ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్‌ను పొందిన తదుపరి ఎలాంటి కట్టడాలైన చేపట్టాల్సి ఉంటుంది. కానీ అవేవి తనకు పట్టనట్లు నిర్మాణదారులు యదేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాన్ని చేపడుతున్నారు.

సంవత్సరం కాలంగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నరని పలు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ స్థాయిలో అన్ని చూడాల్సిన ఆ అధికారి అట్టి అక్రమ నిర్మాణంకు సంబంధించి నోటీసులు ఇచ్చినా కూడా నిర్మాణ పనులు సాఫీగా జరగడమనేది విడ్డూరంగా ఉంది. జిల్లాస్థాయి, మండల స్థాయి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వెనక గట్టి మతలబు ఏమైనా ఉందేమోనని అనుమానాలు సైతం గ్రామంలో వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసిన కూడా పనులు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. క్షేత్ర స్థాయిలో బాధ్యత వహించాల్సిన సదరు అధికారి చూసీ చూడనట్లు వ్యవహరిస్తూ, ఉన్నతాధికారుల దృష్టికి ఈ వ్యవహారం తీసుకెళ్లకపోవడం గమనార్హం. ఎంపీడీవో, ఎంపీఓ నిర్లక్ష్యపు ధోరణితో నిబంధనలు పాటించకున్నప్పటికి నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నట్లు పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై గ్రామస్తులు ప్రభుత్వ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా చేపట్టిన బహుళ అంతస్తుల నిర్మాణంపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.





నోటీసులు ఇచ్చాం

ఈ విషయంపై మందాపూర్ పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా.... పర్మిషన్ లేకుండా నిర్మాణాలు చేపట్టకూడదని నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామ శివారులో నిర్మాణ పనులు జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. నిర్మాణ పనులను నిలిపివేయాల్సిందిగా నెల క్రితం సంబంధిత నిర్మాణదారునికి నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు.

శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం

అక్రమ నిర్మాణాల విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా.. అనుమతులు లేకుండా బిల్డింగ్ నిర్మాణాలు చేపట్టటం నిబంధనలు ఉల్లంఘించినట్లేనని తెలిపారు. సత్వరమే నిర్మాణాల విషయంపై విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ తెలిపారు.

టీఆర్ఆర్ మెడికల్ ఆసుపత్రి భవనంపై నుంచి దూకి వ్యక్తి మృతి

నవతెలంగాణ-పటాన్ చెరు



టీఆర్ఆర్ మెడికల్ ఆసుపత్రి భవనం పై నుంచి దూకి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి క్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన శ్యాం ప్రసాద్ (26) కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మండలంలోని ఐనోల్ శివారులో గల టీఆర్ఆర్ మెడికల్ ఆసుపత్రిలో గురువారం ప్రత్యేక మెడికల్ క్యాంపు ఉండడంతో శ్యాం ప్రసాద్ వెళ్లాడు. గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో ఫోన్ పోయింది నీవే తీసావ్ అంటూ అనుమానం పడడంతో భయపడిపోయిన శ్యాంప్రసాద్ నాలుగో అంతస్తు వెళ్లి అక్కడి నుంచి కిందికి దూకడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. బీరంగూడలోని పనేసియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ, తీసుకుపోయిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా పై అధికారుల తనిఖీల్లో భాగంగా టీఆర్ఆర్ యజమాన్యం ప్రత్యేక క్యాంపుల సమయంలో రూ.500 చొప్పున ఇచ్చి శిబిరాలకు తరలిస్తారనే ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. శ్యాంప్రసాద్ మృతి చెందటానికి యజమాన్యం తీవ్ర నిర్లక్ష్యమే కారణమంటూ మృతుడి అన్న ప్రభాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ అంబర్య నాయక్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల ప్రతిభను వెలికి తీయడానికే డ్యూటి మీట్

మల్టీ జోన్-2 ఐ.జి. వి.సత్యనారాయణ

నవతెలంగాణ-సంగారెడ్డి



పోలీసుల ప్రతిభను వెలికి తీయడానికే పోలీసు డ్యూటి మీట్ నిర్వహించడం జరుగుతుందని మల్టీ జోన్-2 ఐ.జి. వి.సత్యనారాయణ అన్నారు. జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ మీట్ నందు సైంటిఫిక్ ఎవిడెన్స్, నేరం జరిగిన తర్వాత నేరస్థలాన్ని ఏ విధంగా ప్రొటెక్ట్ చేయాలి, నేరస్థలం నందు క్లూస్ ఏ విధంగా సేకరించాలనే విషయాలను తెలియజేశారు. కంప్యూటర్ పరిజ్ఞానం, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ పని తీరుపై పరీక్షలు నిర్వహించడం జరిగిందని అన్నారు. ఈ నెల 14 నుంచి 18 తేదీలలో జరిగే స్టేట్ లెవెల్ డ్యూటీ మీట్ నందు సత్తా చాటి, అనంతరం రాంచీలో జరిగే నేషనల్ స్థాయి డ్యూటి మీట్‌కు అర్హత సాధించాలని పోలీసులకు సూచించారు. పోలీసులకు పేరు తీసుకువచ్చేది ఇన్వెసిగేషన్ అని, ఈ డ్యూటి మీట్ ద్వారా ఇన్వెసిగేషన్‌లో మెళకువలు నేర్చుకోవచ్చన్నారు. సరైన పద్ధతిలో ఇన్వెసిగేషన్ చేసి కేసును డిటెక్ట్ చేసినట్లయితే పోలీసుల పనితీరును గుర్తించడం జరుగుతుంద న్నారు. అనంతరం డిస్టిక్ లెవెల్ జోనల్ లెవెల్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అవార్డులు అందించారు. ఎస్పీ చెన్నూరి రూపేష్ మాట్లాడుతూ గత నెల 25,26 తేదీలలో జిల్లా స్థాయి డ్యూటీ మీట్ నిర్వహించి, అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని జోనల్ స్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక చేయడానికి, గత రెండు రోజులుగా సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాకు చెందిన అధికారులు, సిబ్బందికి జోనల్ లెవెల్ డ్యూటీ నిర్వహించడం జరిగిందని వివరించారు. అనంతరం ఈ పోలీస్ డ్యూటీలో జిల్లా డ్యూటి మీట్ నోడల్ అధికారి అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, డియస్పి రామ్ మోహన్ రెడ్డి, ఇన్స్‌పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మారేపల్లి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలి

పంచాయతీ కార్మికులపై కక్ష సాధింపు చర్యలు ఆపాలి

నవ తెలంగాణ-కొండాపూర్



మండల పరిధిలో మారేపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి కార్మికులపై అవలంభిస్తున్న కక్ష సాధింపు చర్యలు ఆపాలని సీఐటీయూ కొండాపూర్ మండల కన్వీనర్ బాబురావు కోరారు. కార్మికుల పట్ల కక్షపూరితంగా వ్యవహస్తున్న మారేపల్లి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాల నుంచి గ్రామపంచాయతీ పరిధిలో బాయికాడి వెంకయ్య పంచాయితీ కార్మికునిగా వాటర్ మెన్‌గా పని పనిచేస్తున్నాడన్నారు. బకాయి వేతనం అడగ్గా పదేపదే ప్రశ్నిస్తున్నారని, కక్షపూరితంగా అతన్ని విధుల్లో నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 3 నెలల నుంచి కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో పండుగ పూట పస్తులు ఉండే పరిస్థితి ఉందన్నారు. కార్మికుని అంగ వైకల్యాన్ని సైతం హేళన చేస్తూ మాట్లాడడం సరైంది కాదన్నారు. కొంతమంది గ్రామస్తులను రెచ్చగొట్టి సరిగా పనిచేయడం లేదనే కారణంతో వారిని తొలగించడం సరైనది కాదన్నారు. గ్రామాల్లో లంచాలు తీసుకొని పనిచేసే పంచాయతీ కార్యదర్శి ఝాన్సీ రాణి పంచాయతీ కార్మికుల గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తొలగించిన గ్రామపంచాయతీ కార్మికుడిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, మూడు నెలల బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోనట్లయితే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, విజయరావు, శీను, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

యోగా ద్వారా మానసిక ప్రశాంతత

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవ తెలంగాణ-పటాన్ చెరు



ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలని, యోగా మన మనస్సునే కాదు. శరీరాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ముదిరాజ్ భవన్‌లో తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5వ రాష్ట్రస్థాయి యోగా పోటీలను శుక్రవారం ఆయన లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, ఆరోగ్యాన్ని పొందడం, జీవన నాణ్యతను మెరుగుపరచడం వంటి అనేక ప్రయోజనాల కారణంగా యోగ ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందని తెలిపారు. పాఠశాల స్థాయి నుంచి యోగాపై శ్రద్ధ పెరిగేలా కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన యోగ అభ్యాసనాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, తులసీదాస్, కుమార్, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి కృపాకర్, జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ టార్చ్ ర్యాలీకి ఘన స్వాగతం

నవతెలంగాణ-సంగారెడ్డి



స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన సీఎం కప్ 2024 టార్చ్ ర్యాలీ హైదరాబాద్ నుంచి వికారాబాద్ మీదుగా సంగారెడ్డికి చేరుకున్నది. సంగారెడ్డి పట్టణ కేంద్రంలో పెద్దాపూర్‌లో డిస్ట్రిక్ట్ యూత్ అండ్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో సీఎం కప్ టార్చ్ ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. టిజిఐసిసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జావిద్ అలీ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ఘన స్వాగతం పలికారు. ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం త్వరలో జరగబోయే సీఎం కప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించి పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ క్రీడాకారులు పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ముఖ్య లక్ష్యమని డివైఎస్ఓ కాసిం బేగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో పరమేష్, టి ఎన్ జి ఓస్ నాయకులు వెంకట్ రెడ్డి, విజయ్ కుమార్, ఆర్ఆర్ డిస్ట్రిక్ట్ డి వై ఎస్ ఓ వెంకటేశ్వర్లు, సీఎం కప్ సీఎం కప్ కాన్వాయ్ ఇంచార్జ్ సీఐ మధు, యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు తోపాటు క్రీడాకారులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూజివీడు ఎన్ఎంహెచ్-క్యాప్సూల్ -4786తో అధిక దిగుబడులు

నవతెలంగాణ-రాయపోల్



నూజివీడు సీడ్స్ వారి క్యాప్సూల్ - 4786 రకం మొక్కజొన్నతో అధిక దిగు బడులు సాధించవచ్చని ఆ కంపెనీ ప్రతినిధులు ప్రవిణ్ రెడ్డి తెలిపారు. సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలంలోని కోనపూర్ గ్రామ రైతు అనిల్ రెడ్డి సాగు చేసిన క్యాప్సూల్- 4786 రకం మొక్కజోన్న పంటను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ రకం పంటలో మొక్కల ఎత్తు మధ్యస్తంగా ఉంటుందని, అలాగే కండె పూర్తిగా కప్పబడి వుంటుందన్నారు. కత్తెర పురుగు నష్టం కూడా తక్కువగా వుంటుందని, దాంతో నాణ్యమైన దిగు బడులు వస్తాయన్నారు. ఒలిపిడి శాతం ఎక్కువగా వుండటం వలన దిగుబడి కూడా అధికంగా వస్తుందన్నారు. అదే విధంగా గింజలు కూడా ఆకర్షణీయ మైన నారింజ రంగులో వుండి అధిక బరువు కలిగి ఉంటాయన్నారు. దాంతో రైతులు మంచి ధరను పొందవచ్చ న్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ ఈ రకం పంట వర్షాకాలానికి అనువుగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో శ్రీ లక్ష్మి రైతు సేవా కేంద్రం లాల్ యాదవ్, సంగమేశ్వర ఫర్టిలైజర్ నాగప్ప, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యం

- కార్మికుల కోసం నిరంతరం పోరాడే యూనియన్ సీఐటీయూ
- సీఐటీయూ జిల్లా, సిఐఈ యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేష్

నవతెలంగాణ-జహీరాబాద్

కార్మికుల సంక్షేమమే సీఐటీయూ లక్ష్యమని, కార్మికుల కోసం నిరంతరం పోరాడే యూనియన్ సీఐటీయూ అని సీఐటీయూ జిల్లా, సీఐఈ యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేష్ అన్నారు. బుచినెల్లి గ్రామ పరిధిలో ఉన్న సీఐఈ ఆటో మోటివ్ ఇండియా పరిశ్రమలో ఈ నెల 5న జరిగే ఎన్నికల సందర్భంగా శుక్రవారం సీఐటీయూ గేట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా అధ్యక్షుడు, యూనియన్ అధ్యక్షుడు బీరం మల్లేశం మాట్లాడుతూ కార్మికుల కోసం నిరంతరం కృషి చేస్తూ, కార్మికుల హక్కుల కోసం పోరాటం చేస్తున్న సీఐటీయూకు మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఐటీయూ గెలవగానే మంచి బ్రహ్మాండమైన వేతన ఒప్పందం చేయడం జరుగుతుందని, అనేక సౌకర్యాలు సాధించి పెడుతుందన్నారు. మంచి వేతన ఒప్పందం కాంట్రాక్ట్ కార్మికుల పర్మనెంట్, అనేక సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ కృషి చేస్తుందన్నారు. సీఐటీయూకు అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ జిల్లాలోని అత్యధిక పరిశ్రమల్లో సీఐటీయూ మంచి వేతన ఒప్పందాలు చేసి అనేక రకాల సౌకర్యాలు, పర్మినెంట్లు చేయించిన ఘనత సీఐటీయూదేనన్నారు. సీఐటీయూను కార్మికులు ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఐఈ ప్రధాన కార్యదర్శి సందీప్ రెడ్డి, క్లస్టర్ కన్వీనర్, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్, వివిధ పరిశ్రమల యూనియన్స్ నాయకులు రాజిరెడ్డి, నర్సయ్య వంశి, నారాయణ, రాజు, పాషా తదితరులు పాల్గొన్నారు.





షూటింగ్ బాల్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్



నారాయణఖేడ్ పట్టణంలోని ఈ-తక్షశిల పాఠశాల మైదానంలో గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి బాల, బాలికల షూటింగ్ బాల్‌లో సంగారెడ్డి జిల్లా వాసులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన ఈ పోటీలలో రాష్ట్ర నలుమూలల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలు ఎంతో రసవత్తరంగా జరగ్గా ఇందులో భాగంగా బాలుర విభాగంలో మొదటి బహుమతి సంగారెడ్డి జిల్లా, రెండవ బహుమతి మహబూబాబాద్, మూడవ బహుమతి గద్వాల, నాల్గవ బహుమతి భూపాలపల్లి జిల్లాలు గెలుపొందారు. అదే విధంగా బాలికల విభాగంలో మొదటి బహుమతి సంగారెడ్డి జిల్లా రెండవ బహుమతి మహబూబాబాద్, మూడవ బహుమతి నల్గొండ, నాల్గవ బహుమతి కామారెడ్డి జిల్లాలు గెలుపొందాయి. ఈ పోటీలకు ప్రతినిత్యం వహించిన ఈ తక్షశిల పాఠశాల కరస్పాండెంట్ శరత్ రాష్ట్ర అసోసి యేషన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌జిఎఫ్ సెక్రటరీ రాంరెడ్డి, రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ ఐలయ్య, సంగారెడ్డి జిల్లా పి ఈ టి అధ్యక్షులు మారుతి పిడి , సెక్రటరీ కిష్టయ్య, దుర్గా ప్రసాద్ పిడి, పాఠశాల కరస్పాండెంట్ శరత్, రమేష్ పిడి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పదవ తరగతిలో శత శాతం ఫలితాలు సాధించాలి

- ఎస్ఎస్ కె కె ఇన్స్టిట్యూషన్ చైర్మెన్ థామస్

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



పదవ తరగతిలో శత శాతం ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకు రావాలని ఎస్ ఎస్ కె కె ఇన్స్టిట్యూషన్ చైర్మెన్ థామస్ అన్నారు. శుక్రవారం అనంతారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాగా చదువుకొని జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికే పేరు తేవాలని ఆయనకు విద్యార్థులకు ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ బాబు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





నవతెలంగాణ

2

సంగారెడ్డి

శనివారం | 05 అక్టోబర్ 2024 | www.navatelangana.com

ఏవో శివకుమార్‌కి వీడ్కోలు

నవతెలంగాణ-మునిపల్లి



మునిపల్లి మండల వ్యవసాయ అధికారి ఏవో శివకుమార్ ఇటీవల బదిలీపై పటాన్ చెరువుకు వెళ్లిన సందర్భంగా శుక్రవారం ఎన్ గార్డెన్‌లో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంబగా ఏడిఏ సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనన్నారు. ఉద్యోగులు ఎక్కడ పనిచేసినా ప్రజలకు రైతులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించినప్పుడే ప్రజలలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. అలాగే ఏవో శివకుమార్ గత పన్నెడు సంవత్సరాలు ఈ మండలంలో పనిచేసి ప్రజలకు రైతులకు అందుబాటులో ఉంటూ పంటలపై అవగాహన కల్పించే విధంగా ఉంటూ మండలంలో మంచి గుర్తింపు పొందారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, స్నేహ లావణ్య ఫర్టిలైజర్ షాప్ యజమానులు ఎడ్ల శంకర్, అనంద్, మాన్యయ్య శంకర్ రెడ్డి, మహేందర్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న ఫిజికల్ వెరిఫికేషన్

నవతెలంగాణ-జహీరాబాద్



పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం అమలులో భాగంగా ఆధార్ అతేంటికేషన్, ఫిజికల్ వెరిఫికేషన్ పనులను గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తరణ అధికారులు చురుకుగా కొనసాగిస్తున్నారు. శుక్రవారం రంజోల్ గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయానికి రాలేని వికలాంగుల ఇంటి వద్దకు వెళ్లి ఆధార్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని తమ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేసుకున్నారు. మిగిలిపోయి ఉన్నా రైతులు అధికారులను సంప్రదించి ఆధార్ వెరిఫికేషన్, ఫేషియల్ అతేంటికేషన్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అహ్మద్, బక్కమ్మ, పాండు, చంద్రమ్మ, మల్లికార్జున్, మొగులన్న, వెంకటేశ్వరరావు, శకుంతలమ్మ, ఫెరోజ్, కృష్ణ, కాంత్ బాబు, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల నూతన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ-మునిపల్లి



మండలంలోని ఆయ గ్రామాలకు సంబంధించిన మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టంకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్ల మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షునిగా అంతారం గ్రామానికి చెందిన ప్రభాకర్, ఉపాధ్యక్షునిగా బుదేరా గ్రామానికి చెందిన ఉల్లాస్, ప్రధాన కార్యదర్శిగా కల్లపల్లి-బేలూర్ గ్రామానికి చెందిన సంజీవులు, కోశాధికారిగా పిల్లోడి గ్రామానికి చెందిన కృష్ణలను ఎన్నుకున్నారు. సభ్యులుగా విజయ్ కుమార్, విశ్వనాథం, చంద్రయ్య, మంజుల, సుజాత, ప్రవీణ్, మల్లేశం, రాజేందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడు ప్రభాకర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారం కోసం తమ వంతు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఇంతటి బాధ్యత అప్పగించేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

దుర్గామాత అనుగ్రహంతో ఐశ్వర్యం సిద్ధించాలి

బీఆర్ఎస్ సీనియర్ నేత యాదిరెడ్డి

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



దుర్గామాత అనుగ్రహముతో ఐశ్వర్యం సిద్ధించాలని బీఆర్ఎస్ సీనియర్ నేత బొల్లారం యాదిరెడ్డి అన్నారు. శుక్రవారం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటరెడ్డి నగర్‌లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా కొలువైన అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరికి ఆరోగ్యం, ఐశ్వర్యం సిద్ధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు యాదిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ప్రవీణ్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి దేవిగా ఉమాదేవి

నవతెలంగాణ- రాయికోడ్



మండల కేంద్రమైన రాయికోడ్‌లోని ఉమాదేవి ఆలయంలో అమ్మవారు శుక్రవారం రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలు ఆలపించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వట్‌పల్లిలో భోగ్ బందర్ ఉత్సాహం

నవతెలంగాణ-వట్‌పల్లి



మండల కేంద్రంలో జై సేవాలాల్ మహారాజ్ జై భవాన్ మాత ఆధ్వర్యంలో జై సేవాలాల్ మహారాజు చౌక్ వద్ద బోగ్ బందర్ ఉత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం పోరా దేవి పీఠాధిపతి శేఖర్ మహారాజు ఆదేశాల మేరకు బోగ్ బండార్ ఉత్సవాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బంజార మండల అధ్యక్షులు సుభాష్ నాయక్, మంచిర్యాల తండా తాజా మాజీ సర్పంచ్ దీప్లా నాయక్, సంధ్య నాయక్, హరి మోహన్, లక్ష్మణ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

షోరూం ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్



మనూర్ మండల సెల్గిరా గ్రామానికి చెందిన పురంజన్ నిరంజన్ సోదరుల ఆధ్వర్యంలో పట్టణంలో ఏర్పాటు చేసిన అరుణోదయ మోటార్స్ మల్టీ బ్రాండ్ బైక్ షోరూంను ఎంపీ సురేష్ సెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డిలు శుక్రవారం ప్రారంభించారు.. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేకు శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్ షెట్కర్, రాకేష్ షెట్కర్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నారాయణఖేడ్ రూరల్

నారాయణఖేడ్ పట్టణం మా ఫంక్షన్ హాల్‌లో లైన్ ఇన్స్పెక్టర్ రాములు ఉద్యోగ విరమణ అభినందన సభ శుక్రవారం ఏర్పాటు చేశారు ఈ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. అనంతరం వారికి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, (డిఈ) శ్రీనివాస్, (ఎస్సీ) శ్రీనాథ్, (ఏడి) నాగేందర్ ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు దిగంబర్ రెడ్డి, సంజు పాటిల్, మాజీ సర్పంచ్ సంగన్న పాల్గొన్నారు..

స్నేహ, సిరి యూత్ ఆధ్వర్యంలో అన్నదాన

నవతెలంగాణ-జోగిపేట



జోగిపేట పట్టణంలోని పబ్బతి హనుమాన్ దేవాలయం ఆవరణలో ప్రతిష్టించిన దుర్గామాత వద్ద దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం జోగిపేట మాజీ కౌన్సిలర్, నిర్వాహకులు పులుగు గోపాల్ రావు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్నేహ, సిరి యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో సుమారుగా 500 మంది భక్తులు భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. ప్రభాకర్ గౌడ్, జిల్లా నాయకులు ఆర్.మానయ్య, జే. ప్రభాత్ కుమార్, మాజీ కౌన్సిలర్ గాజుల నవీన్, స్నేహ, సిరి యూత్ సభ్యులు రాజు, ముద్దు కృష్ణ, రాజా గౌడ్, డి.బి. సతీష్, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామ పంచాయతీలను సందర్శించిన అధికారులు

నవతెలంగాణ-మనూర్



నాగల్‌గిద్దా మండలంలోని పుసల్పాడు, గౌప్యానాయక్ తండా గ్రామ పంచాయతీలను శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపిడిఓ బలరామ్ మహేష్ రావ్ సందర్శించారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామంలో గల నీటి ట్యాంకు శుభ్రం చేయడం, వాడుకునే నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా పలు జాగ్రత్తలు గురించి సూచించారు. చెత్త చెదారం రోడ్డు పైన వేయకూడదని, మురుకి కాలువలు శుభ్రంగా ఉండాలని పంచాయతీ సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి లబ్ధిదారులకు ధృవీకరణ పత్రాలు

నవతెలంగాణ-సదాశివపేట



మహాలక్ష్మి పథకం లబ్ధిదారులకు శుక్రవారం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డిలు ధృవీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామన్నారు. చింత ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల రుణమాఫీ ఇప్పటివరకు 100% పూర్తికాలేదు, టెక్నికల్ ప్రాబ్లం ఏదైనా ఉంటే తొందరగా క్లియర్ చేసి రైతు రుణమాఫీ అయ్యేలా చేయాలన్నారు, అదేవిధంగా కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు తులం బంగారం కూడా ఇచ్చి హామీ నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ పాటిల్, వైస్ చైర్మెన్ చింత గోపాల్, కమిషనర్ ఉమా, సిడిసి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, కాంగ్రెస్ టౌన్ ప్రెసిడెంట్ మునిపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు

- 17వ వార్డులో పైలట్ ప్రాజెక్ట్
- ఆర్డీవో పాండు

నవతెలంగాణ-జోగిపేట



సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డులు అందిస్తుందని జోగిపేట ఆర్డిఓ పాండు అన్నారు. శుక్రవారం అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 17వ వార్డులో వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ కొత్తగా రేషన్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. సంక్షేమ పథకాల అమలుకు డిజిటల్ కార్డులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఇది కుటుంబానికి రక్షణ కవచమన్నారు. దీనిలో ఆరోగ్యపరమైన వివరాలు కూడా పొందుపరుస్తామని తెలిపారు. సర్వేలో భాగంగా ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సరిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ గీత, 17వ వార్డ్ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు, కమిషనర్ తిరుపతి, సానిటరీ ఇన్స్పెక్టర్ వినయ్, వార్డు ఇన్చార్జి ప్రసాద్, మెప్మా కోఆర్డినేటర్ బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కన్యకా పరమేశ్వరి మందిరంలో నవరాత్రి ఉత్సవాలు

నవతెలంగాణ -సదాశివపేట



దసరా నవరాత్రి ఉత్సవాల్లో రెండవ రోజు శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు అనుముల సాయిరాజ్ ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రి దేవి అలంకరణతో అమ్మవారికి అభిషేకం సామూహిక మహిళా భక్త బృందం కుంకుమ అర్చనలు, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని ఆ అమ్మవారి కృపతోనే ప్రజలందరూ సల్లంగు ఉండాలని వేడుకుంటున్నామన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తామన్నారు. కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ను పురపాలక సంఘం చైర్ పర్సన్ కౌన్సిల్ సభ్యులను శాలువా పూలదండలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు కోడూరి అంజయ్య, కౌన్సిలర్లు విద్యాసాగర్ రెడ్డి, ఆకుల శివకుమార్, ఇంద్ర మోహన్ గౌడ్, చౌదరి ప్రకాష్, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి వీరేశం, కౌన్సిలర్ సాతాని శ్రీశైలం, శ్రీనివాస్, సత్యనారాయణ, మాడిశెట్టి ప్రకాశం, మల్లికార్జున శంకర్, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు దిడిగి నాగేష్, కొత్త రమేష్, అశోక్, కిషన్, వినోద్, బిక్షపతి, రేగళ్ల అశోక్, ఆర్యవైశ్య మహిళా భక్త బృందం తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-పటాన్ చెరు




సద్దుల బతుకమ్మ పర్వదినం పురస్కరించుకొని ఈ నెల 10వ తేదిన పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై నిర్వహించబోయే బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను శనివారం ఉదయం పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ప్రధానంగా బతుకమ్మ ఘాట్ వద్ద మహిళల సంఖ్యకు అనుగుణంగా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని జిహెచ్ఎంసి అధికారులను ఆదేశించారు. ప్రతి ఏటా సాకి చెరువు కట్టపై సద్దుల బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వివిధ కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ గాయని గాయకులచే సంగీత విభావరి నిర్వహించబోతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సురేష్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పాల్గొన్నారు.

ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి

- ఎమ్మెల్సీ ప్రో కోదండరామ్‌కు వినతి

నవతెలంగాణ-సంగారెడ్డి



సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ తెలంగాణ పంచాయతీరాజ్ నాల్గోవ తరగతి ఉద్యోగులు ఎమ్మెల్సీ ప్రో కోదండరామ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు వై. నర్సింలు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాహుల్‌లు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని సిపిఎస్ విధానంతో ఉద్యోగులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా ఓపిఎస్‌ను పునరుద్ధరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, అదేవిధంగా ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డిఎలను వెంటనే చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు.

పద్మనాభ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ - సదాశివపేట

బతుకమ్మ పండుగ తెలంగాణలో పుట్టి ప్రపంచమంతా ప్రఖ్యాతిగాంచిన పండుగ. ప్రకృతిలో లభించే పువ్వులను దేవతగా కొలిచే గొప్ప పండుగ ఈ బతుకమ్మ పండుగ అని శ్రీ పద్మనాభ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ కుమార్ అన్నారు. తెలంగాణ ప్రాంతంలో ఆడపడుచులు బతుకమ్మను గౌరమ్మగా భావించి తొమ్మిది రోజులు అంగరంగ వైభవంగా ఆటపాటలతో బతుకమ్మ ఆడుతూ గంగమ్మ ఒడికి చేరుస్తారన్నారు. కళాశాలలో విద్యార్థులు తీరొక్క పువ్వులను సేకరించి అందమైన చక్కని బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగ నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, కళాశాల అధ్యాపకులు సౌజన్య, అరవిందరావు, ప్రవీణ్ కుమార్, సతీష్ కుమార్ , నర్సింలు,సంగమేశ్వర్ రెడ్డి, జంగం మహేష్, నర్సింలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని పోచమ్మ బస్తీకి చెందిన పూజా దేవి (24) భర్త వదిలేయడంతో తన తల్లితో కలిసి జీవిస్తున్నారు గత నెల రోజులుగా ఆరోగ్యం బాగాలేక వాళ్లకు ఎవరూ లేకపోవడంతో కాలనీవాసులు బొల్లారం బీజేపీ అధ్యక్షులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆనంద్ కృష్ణ రెడ్డి బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అందించి, 108 అంబులెన్స్‌కి ఫోన్ చేసి గవర్నమెంట్ హాస్పిటల్‌కి పంపించారు. ఆనంద్ కృష్ణ రెడ్డి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునే వాడే నాయకుడు ఎవరికి ఏ కష్టం వచ్చినా తన వంతుగా సేవలు అందిస్తానన్నారు.

శివాలయ అభివృద్ధికి కృషి

మున్సిపల్ వైస్ చైర్మన్ అనిల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం

జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని బొల్లారం మున్సిపల్ వైస్ చైర్మెన్, కాంగ్రెస్ సీనియర్ నేత అంతి రెడ్డి గారి అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శివాలయాన్ని అద్భుతంగా నిర్మించేలా కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. దేవాలయం కు సంబంధించి సుమారు రూ 6 లక్షల విలువచేసే స్లాబ్ వేయించేందుకు సహకరిస్తానని తెలిపారు. దాతలు ముందుకు వచ్చి దేవాలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.



దివ్యాంగుడికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి చేయూత

- సొంత నిధులతో ఆటో అందజేత

నవతెలంగాణ-పటాన్ చెరు



రోడ్డు ప్రమాదంలో కుటుంబ సభ్యులను కోల్పోయి వెన్నుపూస గాయంతో ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగుడికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అండగా నిలిచారు. సొంత నిధులతో ఆటో అందించి తన ఉదారతను చాటుకున్నారు. గుమ్మడిదల మం డలం దోమడుగు గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయప డ్డాడు. ప్రమాదంలో తన కుటుంబ సభ్యులను సైతం కోల్పోయాడు. తల్లితో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. ప్రమాదంలో వెన్నుపూసకు గాయం కావడంతో ఉపాధి లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. స్వయం ఉపాధి కల్పించాలని ఇటీవల ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేయగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రూ.3 లక్షల సొంత నిధులు వెచ్చించి ఆటో కొనుగోలు చేశారు. ఈ మేరకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ రెడ్డికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆటోను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని వికలాంగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని తెలిపారు. గతంలో దేశంలోని మొట్టమొదటిసారిగా నియోజకవర్గ పరిధిలోని దివ్యాంగుల కోసం 400 స్కూటీలు అందించడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులోనూ అండగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, వెలిమల పిఎసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, షకీల్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతయే ప్రభుత్వ లక్ష్యం

- జెడ్పీ సీఈవో జానకి రెడ్డి

నవతెలంగాణ-వట్‌పల్లి



గ్రామాలలో మంచినీటి సరఫరా, పైపులైను మరమ్మతులు, త్రాగునీటి కుళాయిల వద్ద ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు ఎంపీఓతో కలిసి ఎంపీడీవోలు గ్రామాల్లో పర్యటించాలని జెడ్పీ సీఈవో జానకి రెడ్డి సూచించారు. శుక్రవారం వట్‌పల్లి ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా.సందర్శించి అధికారుల పనితీరును తెలుసుకుని, రికార్డులను పరిశీలించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ప్రతిరోజు గ్రామాల వారిగా షెడ్యూలు పెట్టుకొని ఒక్కో రోజు ఒక్కో గ్రామానికి వెళ్లి గ్రామంలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వీలైనంత తొందరగా పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. మేజర్ సమస్యలపై జిల్లాస్థాయి అధికారులకు నివేదిక రూపంలో పంపినట్లయితే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సిబ్బంది విధులకు సక్రమంగా హాజరవుతున్నారా సిబ్బంది లేమితో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు, అటెండర్ పోస్టులు భర్తీ కాకపోవడంతో కార్యాలయం పనుల పట్ల కొంత సమస్యగా ఉన్నదన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకూడదని, విధుల పట్ల చురుగ్గా వ్యవహరించాలని ఇన్చార్జి ఎంపీడీవోకు సూచించారు. క్రీడా ప్రాంగణాలకు ఎంపికైన ప్రాంతాలను అక్రమార్కులు దున్నుతున్నారని, క్రీడా సామగ్రిని ధ్వంసం చేస్తున్నారని అటువంటి వారి పై చర్యలు తీసు కోవాలని సూచి ంచారు. ఎంపీ డీవో, ఎంపీఓ, సూపరింటెంట్, సీనియర్ అసి స్టెంట్ తదిత రులు ఉన్నారు.

మురికి కాలువలను శుభ్రం చేసిన పంచాయతీ కార్మికులు



నవతెలంగాణ-పుల్కల్ : మండల కేంద్రమైన పుల్కల్ గ్రామంలో మురికి కాలువలను పంచాయతీ కార్మికులు శుక్రవారం శుభ్రం చేశారు. మురికి నీరు రోడ్లపై ప్రవహించి పప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రజలు గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే ఆయన స్పందించి కార్మికులతో మురికి కాలువలను శుభ్రం చేయించిరు. గ్రామంలో ఎక్కడ మురుగునీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకుంటు న్నామని గ్రామ కార్యదర్శి తెలిపారు అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు గ్రామ అభివృద్దే లక్ష్యంగా పని చేస్తామని, ప్రజలు తమకు సహకరించాలని ఆయన కోరారు.

వివిధ అభివృద్ధి పనుల పరిశీలన



నవతెలంగాణ-ఐడీఏ బొల్లారం: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో గల బతుకమ్మ ఘాట్ సీసీ పనులను, 22వ వార్డు మల్లన్న బస్తీలో, 3వ వార్డు ఓల్డ్ విలేజ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్ రెడ్డి పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు టి.సాయి కిరణ్ రెడ్డి, వి. శ్రీకాంత్ యాదవ్, కో ఆప్షన్ మెంబర్ టీ రంగా రెడ్డి, ఎఇ కిష్టయ్య ,మాజీ వార్డ్ మెంబర్ పి.రజిత శేషా రెడ్డి, స్థానిక కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఘనంగా బిఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి జన్మదినం

నవ తెలంగాణ -సదాశివపేట



సదాశివపేట పట్టణంలో మున్సిపల్ చైర్ పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్ నివాసంలో బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వీరేశంకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శివరాజ్ పాటిల్, మున్సిపల్ వైస్ చైర్మన్ చింత గోపాల్, కౌన్సిలర్లు ఇంద్ర మోహన్ గౌడ్, శ్రీనివాస్, ఆకుల శివ, విద్యాసాగర్ రెడ్డి, సాతాని శ్రీశైలం, కోఆప్షన్ సభ్యులు కోడూరు అంజయ్య, బిఆర్ఎస్ 19వార్డ్ ఇంచార్జ్ బరాడి శివ, తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నమ్మగ తెలుగు దినపత్రిక
3
మెదక్
శనివారం | 05 అక్టోబర్ 2024 | www.navatelangana.com

షౌకత్ పల్లి వడ్డెర కాలనీకి బిటి రోడ్డువేయాలి



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని ప్రభుత్వాలు చెప్పున్నప్పటికీ నేటికీ షౌకత్ పల్లి వడ్డెర కాలనీకి బీటీ రోడ్డు లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల పరిధిలోని తిప్పనగుల్ల గ్రామపంచాయతీ పరిధిలోని షౌకత్ పల్లి వడ్డెర కాలనీకి బీటి రోడ్డు వేయాలని ప్రభుత్వాలకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. వడ్డెర కాలనీలో దాదాపుగా 50 కుటుంబాలు నివసిస్తున్నాయని ఇక్కడి నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నామని మట్టి రోడ్డుతో పూర్తిగా గుంతల మాయమై బురదలో నడవలేని పరిస్థితి ఉన్నదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుని చౌకత్ పల్లి వడ్డెర కాలనీకి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

- దసరా పండుగను ఘనంగా నిర్వహించాలి



నవతెలంగాణ-మనోహరాబాద్

గ్రామపంచాయతీ కార్మికులు దసరా పండుగను సుఖసంతోషాలతో ఆనందంగా నిర్వహించు కోవాలని కొండాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ మమత రవి ముది రాజ్ పేర్కొన్నారు. దసరా పండు గను పురస్కరించుకొని గ్రామ పంచాయతీ కార్మికులకు మాజీ సర్పంచ్ మమతరవి ముదిరాజ్ శుక్రవారం నూతన బట్టలు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దసరా పండుగను ఆనందంగా నిర్వహించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు ముదిరాజ్ పారిశుద్ధ కార్యక్రమం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర అభివృద్ధి సాధన కోసం పోరాటం



నవ తెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో మెదక్ ఏరియా మహాసభలో సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం సమక్షంలో మెదక్ ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. మెదక్ ఏరియా కార్యదర్శిగా కోరింకల మల్లేశంను ఏకగ్రీవంగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. ఏరియా కమిటీ సభ్యులుగా పద్మిని, దేవయ్య, సి.హెచ్ లచ్చ గౌడ్, గజగట్లపల్లి బాల నరసయ్య, యశోద, బచ్చల నాగమణి, అంజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కొరెంకల మల్లేశం మాట్లాడుతూ మెదక్ ఏరియా మహాసభలో నాలుగు మండలాల్లో ఉన్న పార్టీ సభ్యులు నాపై నమ్మకం ఉంచి, తనను ఏరియా కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు పేరు పేరునా సభ్యులందరికీ విప్లవాభివందనాలు తెలిపారు. ఏరియా పరిధిలో ఉన్న ప్రజల సమస్యలపై స్పందిస్తూ సామాజిక న్యాయం కోసం, సమాన హక్కుల కోసం, సంక్షేమ పథకాల అమలు కోసం, నిరంతరం కృషి చేస్తానన్నారు. ఏరియా పరిధిలోని నాలుగు మండలాల్లో భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, మెదక్ చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు ఉపాధి కోసం పనులు చేసుకోవడానికి మెదక్ వస్తున్నారన్నారు. మెదక్‌లో అనేక సమస్యలు పాలకుల నిర్లక్ష్యం వల్ల ఏర్పడుతున్నాయన్నారు. జిల్లా కేంద్రంలోని చిన్నపిల్లల పార్కును, గత పది సంవత్సరాల నుంచి మూసివేశారని మార్కెట్లో బిల్డింగ్ నిర్మించి వృధాగా ఉంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్యాంకు బండ్ పేరుతో రూ.9 కోట్లు మంజూరు చేశామని పేపర్లో ప్రకటనలు ఇచ్చి కోటి రూపాయలు ఖర్చు చేసి చేతులు దులిపేసుకున్నారన్నారు. మెదక్‌ను సుందరీకరణ చేస్తామని చెప్పిన స్థానిక ఎమ్మెల్యే కేవలం ఫోటోలకు పోజులిస్తు కాలయాపన చేస్తున్నారన్నారు. మెదక్ అభివృద్ధి కాకపోవడానికి కారణం నాటి, నేటి పాలకులేనని ఆవేదన వ్యక్తం చేశారు. మాటలతో కాలయాపన చేయడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా జిల్లా కేంద్రంలోని పెండింగ్‌లో ఉన్న ట్యాంక్ బండ్, చిల్డ్రన్స్ పార్కు, మహనీయుల విగ్రహాలు, మార్కెట్ బిల్డింగ్ వెంటనే వాడకంలోకి తీసుకురావాలని, అభివృద్ధి పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీనిపై సీపీఐ(ఎం) పార్టీ ఏరియా కమిటీ ప్రభుత్వంపై పోరాట కార్యాచరణ రూపొందించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దేవయ్య, బాలనర్సయ్య, ఏరియా కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు శిక్షణ

- జెడ్పి సీఈవో సిహెచ్. ఎల్లయ్య



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచి నీటి సహాయకులకు శుక్రవారం జడ్పీ సీఈఓ సిహెచ్ ఎల్లయ్య ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మిషన్ భగీరథ మంచినీటి సహాయకులకు పలు సూచనలు చేస్తూ, మండల వ్యాప్తంగా ఎక్కడ మిషన్ భగీరథ పైప్లైన్లు లీకేజీ సమాచారం అందిన వెంటనే స్పందించి మరమ్మత్తులు చేయాలన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా మండల వ్యాప్తంగా ప్రజలకు మంచినీటి కొడత లేకుండా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషాద్రి, ఆర్డబ్ల్యూఎస్.ఏ. ఈ లు స్వప్న, మీన, మంచినీటి సహాయకులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భార్య ఆరోగ్యం బాగాలేదని బాధపడి భర్త ఆత్మహత్య



నవతెలంగాణ-చిలిపిచేడ్

భార్య ఆరోగ్యం బాగాలేదని బాధపడి భర్త సూసైడ్ చేసుకున్న ఘటన చిలిపిచేడ్ మండల కేంద్రంలో చేసుకుంది. ఎస్సై యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం.. చిలిపిచెడ్ గ్రామానికి చెందిన చాకలి మహేష్ (33) భార్య సావిత్రి 15 రోజుల నుండి ఆరోగ్యం బాగా లేనందుకు తల్లి గారిల్లు అయిన కాద్గుర్‌లో ఉన్నది. భార్య ఆరోగ్యం బాగాలేదని బాధపడుతూ మహేష్ పాలివారు అయిన చాకలి చంద్రయ్య ఇంట్లోకి వెళ్లి తలుపు పెట్టుకొని చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు. మృతి చెందిన మహేష్‌కు ఒక కొడుకు ఒక కూతురు ఉన్నారు.

ఎస్జిటి జిల్లా టాపర్‌కు సన్మానం



నవతెలంగాణ-చిలిపిచేడ్

డీఎస్సీ ఫలితాలలో ఎస్జీటీలో మెదక్ జిల్లా టాపర్ లింగంను మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆనంద్, వైస్ ఎంపీపీ విశ్వంబర్ స్వామిలు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ విఠల్, వైస్ ఎంపీపీ విశ్వబర్ స్వామి మాట్లాడుతూ.. మండల పరిధిలోని రహీంగుడాకు చెందిన లింగం కష్టపడి ఎస్జిటిలో జిల్లా ఫస్ట్ ర్యాంకు వచ్చినందుకు చాలా సంతోషమన్నాను. అనంతరం లింగంను సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పండరి, దుర్గాచలం, రాజు, సుభాష్ రెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కొల్చారం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రంగంపేటలో ఏర్పాటు చేసిన దుర్గామాతను శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంటప నిర్వాహకులు ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దుర్గాదేవి ఆశీస్సులు ప్రజలకు సుభిక్షంగా ఉండాలని కోరారు. అనంతరం కొల్చారం గ్రామానికి చెందిన ఎండుగుల కృష్ణ గృహప్రవేశంలో పాల్గొన్నారు. అనంతరం బాధితులు, మృతుల కుటుంబాలను ఎమ్మెలల్యే పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగె రమేష్ కుమార్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, పిఎసిఎస్ వైస్ చైర్మన్ మోత్కు మల్లేశం, నాయకులు ముత్యం గారి సంతోష్ కుమార్, వేమారెడ్డి, నరేందర్ రెడ్డి, తలారి దుర్గేష్, సురేష్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి అమ్మవారిగా భక్తులకు దర్శనం



నవతెలంగాణ-వెల్దుర్తి

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని వెంకటేశ్వర దేవాలయం ప్రాంగణంలో దుర్గామాత విగ్రహాన్ని రెండవ రోజు గాయత్రీ అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. మానేపల్లి గ్రామంలో భక్తులు ఏర్పాటు చేసుకున్న దుర్గామాత అఖండ కోటి భక్త జనాలకు గాయత్రి మాతగా దర్శనమిచ్చారని తెలిపారు అమ్మవారికి ఉదయం సాయంత్రం హారతి ధూప దీప నైవేద్యం భజనతో సాయంకాల సమయంలో భక్త సంకీర్తన పాటలతో ఆలయాల ప్రాంగణమంతా మారుమోగుతుంది. భక్తులు విజయదశమి పర్వదినాల్లో సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నారు.

5వ తేది వరకు అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

- అదనపు కలెక్ట్ వెంకటేశ్వర్లు



నవ తెలంగాణ-మెదక్ టౌన్

డి.ఎస్సి 2024 లో అర్హత సాధించిన 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ పక్కాగా వేగవంతంగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. డి.ఎస్సి 2024 లో 704 ఎంపికయ్యారని 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమం స్థానిక జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాలలో జరుగుతుంది. గురువారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్వయంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ నియామక ప్రక్రియకి సంబంధించి అర్హత సాధించిన అభ్యర్థుల ధృవీకరణ పత్రాల పరిశీలన పక్కాగా చేపట్టాలన్నారు. క్వాలిఫై అయిన అభ్యర్థులతో కలెక్టర్ మాట్లాడారు. కౌంటర్లను పరిశీలిస్తూ తగు సూచనలు ఇచ్చారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కొరకు చేపట్టిన ఏర్పాట్లను కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. ఎస్.ఏ.(స్కూల్ అసిస్టెంట్లు)లకు ఎస్.జి.టి. సెకండరీ గ్రేడ్ టీచర్లుఉ లకు, తెలుగు, హిందీ పండిట్ లకు పి.ఈ.టి.లకు 13 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు డిఈఓ వివరించారు. శుక్రవారం వరకు మొత్తం 704 మంది అభ్యర్థులకుగాను 618 మంది అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన పూర్తి అయ్యిందని, మిగతా వారు శనివారం హాజరు కావచ్చని డిఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ, ఈ డిస్టిక్ మేనేజర్ సందీప్ అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, గెజిటెడ్ హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ అధికారులు పాల్గొన్నారు.

పకడబ్బందీగా డీజీటల్ కార్డుల సర్వే నిర్వహణ

- కుటుంబాల సమగ్ర సమాచారంతో సర్వే
- మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-మెదక్ టౌన్

ఒక కుటుంబం ఒక కార్డు లక్ష్యంగా డీజీటల్ కార్డులను అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలో పత్తే నగర్ 20వ వార్డులో రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్‌గా చేపట్టిన డీజీటల్ ఫ్యామిలీ కార్డు సర్వేను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్వయంగా కుటుంబ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పగడ్బందీగా నిర్వహణకు అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువ (బీపీఎల్) దారిద్ర్య రేఖకు ఎగువ (ఏపీఎల్)తో సంబంధం లేకుండా ఒక కుటుంబానికి ఒక గుర్తింపు కార్డు అందజేయడానికి సంబంధిత కుటుంబం డేటా అంత ఆ కార్డులో నిక్షిప్తమై ఉండేలా, దేశస్థాయిలో ఆధార్ కార్డుకు ఎంతటి ప్రాముఖ్యం ఉందో అదే స్థాయిలో ఫ్యామిలీ కార్డు పని చేసేలా ఎక్కడి నుండైనా ఈ కార్డు పని చేసేలా రూపొందించడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 289 కుటుంబాలు లక్ష్యంగా నాలుగు బృందాలుగా విడిపోయి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి కుటుంబం సమగ్ర వివరాలకు సంబంధించిన షీట్ ప్రత్యేకంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ అధికారులకు అవసరమైన సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు. సర్వేలో ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. మరణించిన వారి పేర్లను తొలగించడం, కొత్తగా కుటుంబంలో చేరిన వారి పేర్లను నమోదు చేయడం, ఉమ్మడి కుటుంబంలో వివాహాలు జరిగిన వారికి కుటుంబాల వారిగా కార్డులను అందజేయడం జరుగుతుందని, ప్రస్తుతం అందజేసే డీజీటల్ కార్డులో మహిళలను కుటుంబ యజమానిగా పేర్కోనడం జరుగుతుందని చెప్పారు. నిష్పక్షపాతంగా పారదర్శకంగా సర్వే లక్ష్యంగా ముందుకు పోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మణ్ బాబు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణంతో ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికులు

- ఎమ్మెల్యేకు విన్నవించిన రంగంపేట ఆటో యూనియన్ కార్మికులు



నవతెలంగాణ-కొల్చారం

ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమ జీవనోపాధి కష్టతరంగా మారిందని, ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కొల్చారం మండలం రంగంపేట పరిసర ప్రాంతాల ఆటో యూనియన్ కార్మికులు శుక్రవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డిని కోరారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మీ ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయడంతో తమ కుటుంబ పోషణ భారంగా మారిందని, పిల్లల ఫీజులు ఆరోగ్య సమస్యలు అధిక భారంగా మారాయని తెలిపారు. చివరకు ఫైనాన్స్ డబ్బులు కట్టలేక పోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే ఆటో కార్మికుల పక్షాన నిరంతరం పోరాడుతానని తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్ చైర్మెన్ అరిగె రమేష్ కుమార్, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌరీ శంకర్, యూత్ అధ్యక్షులు కోనాపూర్ సంతోష్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ మోత్కు మల్లేశం, మాజీ జడ్పీటీసీ ముత్యంగారి సంతోష్ కుమార్, వేమారెడ్డి, నరేందర్ రెడ్డి, చిట్కాల సురేష్, సుధాకర్, తలారి దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు గజమాలతో స్వాగతం

- మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు కూడా స్వాగతం పలికిన నేతలు
- స్వాగతించిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ-తూప్రాన్

తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని అల్లాపూర్ టోల్ ప్లాజా వద్ద టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌కు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించి ఘనంగా స్వాగతం పలికారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు కూడా స్వాగతం పలికారు. హైదరాబాదు నుండి నిజామాబాద్ జిల్లా పర్యటనకు వెళ్తున్న టీపీసీసీ అధ్యక్షులకు 44వ జాతీయ రహదారి టోల్ ప్లాజా వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు నేతలు భారీగా తరలివచ్చి గజమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డిలు పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, మున్సిపల్ చైర్పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, సీనియర్ నాయకులు నేత మహేందర్ రెడ్డి, తూప్రాన్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మామిళ్ళ కృష్ణ, జింక మల్లేష్, కౌన్సిలర్లు పల్లెర్ల రవీంద్ర గుప్తా, నారాయణ గుప్తా, రవీందర్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, చేగుంట మండల పార్టీ అధ్యక్షులు వడ్ల నవీన్,సీనియర్ నాయకులు వెంగళరావు, అంజా గౌడ్, జగన్ గౌడ్, గొల్ల పోచయ్య, కమ్మరి రాజు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయ కమాన్‌కు మాజీ జెడ్పీటీసీ విరాళం



నవతెలంగాణ-నిజాంపేట

మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో మల్లన్న ఆలయ కమాన్ నిర్మాణానికి శుక్రవారం మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ రూ.1,01,116లను గ్రామస్తుల సమక్షంలో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్మెడ మల్లన్న ఆలయ కమాన్ నిర్మాణం కొరకు గతంలో మాట ఇవ్వడం జరిగిందని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి మల్లన్న ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందించామన్నారు. మండలంలో దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని మండపాలలో దుర్గాదేవి అమ్మవారు కొలువుదీరారని. దసరా నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. చల్మెడ నుంచి మల్లన్న ఆలయం వరకు ఉన్న అంతర్గత జిల్లా కామారెడ్డి పెద్ద మల్ల రెడ్డికి వెళ్లే రోడ్డును త్వరలో మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రజల సౌకర్యార్థం పనిచేస్తామన్నారు. అనంతరం గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టి సభ్యత్వాలు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో మల్లన్న ఆలయ కమిటీ సభ్యులు బొమ్మన మల్లేశం, దొంతర బోయిన మధు, ఆకుల బాలయ్య, బెస్త నర్సింలు, బొమ్మెన నర్సింలు, స్వామి, తుమ్మల రమేష్, నాగరాజు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడికి ఘన స్వాగతం



నవతెలంగాణ-మనోహరాబాద్

టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ పర్యటనకు వెళుతుండటంతో మెదక్ జిల్లా ప్రారంభంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. టీపీసీసీ హోదాలో మొదటిసారిగా జిల్లా నుంచి వెళ్తుండడంతో అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు టీపీసీసీ అధ్యక్షునికి ఘన స్వాగతం పలికారు. భారీ క్రేన్ సహాయంతో పూలదండను ఏర్పాటు చేసి స్వాగతం పలికారు. అనంతరం కాళ్లకల్ బంగారమ్మ దేవాలయంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ నాయకురాలు ఆంక్ష రెడ్డిలతోపాటు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



నవతెలంగాణ-నిజాంపేట

బీజేపీ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ పంజ విజయ్ కుమార్ మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో దుర్గామాత మండప నిర్వాహకులు, యువకులను గ్రామ పెద్దలను కలిశారు. శుక్రవారం దుర్గామాత అమ్మవారి దర్శనం చేసుకోన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పెద్దలతో గ్రామ అభివృద్ధి, సమస్యలను అడిగి తెలుసుకోన్నారు. యువకులు దేశభక్తి సమాజసేవ చేయడానికి ముందుకు రావాలని అదేవిధంగా చత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకొని దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, వంజరి రాములు, బొమ్మెన మల్లేశం, మాజీ సర్పంచ్ తుమ్మల నాగరాజు, సంఘపు నారాయణ, మాజీ ఉపసర్పంచ్ తుమ్మల రమేష్, మధు సాకలి నరసయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవతెలంగాణ-నిజాంపేట

మండలంలోని చల్మెడ గ్రామాల లోని పలు వ్యవసాయ క్షేత్రాలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. అందులో భాగంగా మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరి పొలానికి ఆకుముడత కాటుక తెగులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలపడం జరిగిందన్నారు. ఆకుముడత నివారణకు లీటర్ నీటికి 0.3 ఎం ఎల్ క్లోరంత్రని ప్రోల్ లేదా క్లోరోపైరీఫాస్ 2 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటిలో లేదా కర్టపై డ్రో క్లోరైడ్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయవలసిందిగా తెలిపారు. అదేవిధంగా వరిలో మాని పండు తెగులు నివారణకి ప్రొఫెకోనజోల్ అనే మందును ఒక లీటర్ నీటికి ఒక మిల్లీమీటర్ లేదా కార్బన్డెజం 50%వి పి 1గ్రా ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారులు రాజు, శ్రీలత, రైతు సోదరులు పాల్గొన్నారు.


కామారెడ్డి రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నిజాంపేట

భారతీయ కిసాన్ సంఘ్ కామారెడ్డిలో తలపెట్టిన రాష్ట్ర మహా సభలకు మెదక్ జిల్లాలోని రైతులు గ్రామ గ్రామాల నుంచి తరలిరావాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహాయ కార్యదర్శి రత్నగారి రాజేశ్వర్ రెడ్డి అన్నారు, ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్ సభలో రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రతి గ్రామంలోని భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. మెదక్ జిల్లాలో 21 మండలాలకు మండలాలకుగాను 11 మండలాలలో సభ్యత్వం చేసుకున్నామని తెలిపారు. రైతులు కామారెడ్డిలో జరిగే రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వరంగల్ డిక్లరేషన్ రైతులకు ఎలాంటి రుణం షరతులు లేకుండా రుణమాఫీ కచ్చితంగా అమలు చేయాలన్నారు. కౌలు రైతులకు గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెదక్ జిల్లా తపస్ ఉపాధ్యక్షురాలిగా రేఖా



నవతెలంగాణ-చేగుంట

చేగుంట పట్టణ కేంద్రం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)మెదక్ జిల్లా తపస్ మహిళా ఉపాధ్యక్షురాలిగా బాలిశెట్టి రేఖ ఎన్నికైనట్లు తపస్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ తెలిపారు. ఈ సందర్భంగా బల్ శెట్టి రేఖా మాట్లాడుతూ తపస్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని, సంఘము రాష్ట్ర, జిల్లా శాఖ ఆదేశాలను పాటిస్తూ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఉపాధ్యాయుల హక్కులు, వారి ప్రతి సమస్యకి పరిష్కార దిశగా తపస్సు రాష్ట్ర పిలుపుమేరకు కృషి చేస్తానని తెలిపారు. తమపై నమ్మకం ఉంచి ఇంతటి బాధ్యతను అప్పగించినందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.


విగ్రహ దొంగల అరెస్ట్, రిమాండ్



నవ తెలంగాణ-టేక్మాల్

టేక్మాల్ మండల కేంద్రంలో ఎల్పుగొండ గ్రామంలో అతి పురాతనమైన కాలభైరవ విగ్రహాన్ని దొంగలించిన దొంగలను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్ మండల పరిధిలోని ఎల్పుగొండ గ్రామంలో ఇటీవల కాలభైరవ విగ్రహం చోరీకి గురైంది. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పశ్చిమగోదావరి జిల్లా చెందిన ఐదుగురు నిందితులను శుక్రవారం అరెస్ట్ చేసిన పోలీసులు వారిని రిమాండ్‌కు తరలించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన చిలుకూరి అరవింద్, పోలిశెట్టి తేజ సాయిబాబు, జొన్న గడ్డల మహేష్ బాబు, తోట జగన్, బందెల శుభానంద్ అనే ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కేసు చేధించిన అధికారులను ఆయన అభినందించారు. అనంతరం ఎల్పుగొండ మాజీ సర్పంచ్ నారాయణ గ్రామస్తులతో కలిసి మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డిని అల్లాదుర్గం సీఐని, పోలీస్ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు కాలభైరవి విగ్రహాల విగ్రహాన్ని పోలీస్ సిబ్బందితో కలిసి మెదక్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి పరిశీలించారు ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పి ఫణిందర్, అల్లాదుర్గ్ సీఐ రేణుక రెడ్డి, టేక్మాల్ ఎస్సై రాజేష్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నిజాంపేట్

మండల కేంద్రానికి చెందిన పెద్ద పైడి తిరుమల్ రెడ్డికి మంజూరైన రూ.1.20 లక్షల సీఎంఆర్ చెక్కును శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యకర్తలు సంబంధిత బాధిత కుటుంబ సభ్యుడైన శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపద సమయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరుకు కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, ఎంఎస్ఎస్ ఓ మండల ఇన్చార్జి వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, టౌన్ అధ్యక్షులు నసిరుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రవీందర్ రెడ్డి, భూమాగౌడ్, మహేష్, రాజేందర్, రమావత్ రాజు, కుమ్మరి బాల్రాజ్, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రి మాత రూపంలో అమ్మ వారు

నవతెలంగాణ-నిజాంపేట.

మండల కేంద్రంలో శ్రీ దుర్గా మాత ఉత్సవ కమిటీ 20వ వార్షికోత్సవంలో భాగంగా రెండవ రోజు దుర్గా అమ్మవారు గాయత్రి మాత అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామ పురోహితులు వేలేటి లక్ష్మణ శాస్త్రి మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రులో భాగంగా రెండవ రోజు గాయత్రి మాత అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారన్నారు. అమ్మవారికి ధూప దీప నైవేద్యాలతో అభిషేక కార్యక్రమాలు చేపట్టామని అమ్మవారి కృపతో గ్రామ ప్రజల సుభిక్షంగా ఉండాలని వేడుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వెల్దుర్తి వెంకటేష్ గౌడ్, ఉపాధ్యక్షులు మాసుల కరుణాకర్, వెంకట్ రెడ్డి,స్వామి గౌడ్, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, రంజిత్ గౌడ్, జీపి స్వామి, సిద్ధరాంరెడ్డి, బాబు, నాయిని శ్రీనివాస్, ప్రసాద్, స్వాములు, పాల్గొన్నారు.

రణధీర్ పత్తి సాగుతో అధిక దిగుబడి



నవతెలంగాణ-మర్కుక్

రాయల్ సీడ్స్ కంపెనీ వారి రణధీర్ పత్తి సాగు చేయడం వల్ల చీడపురుగులు ఆశించవని, రైతులకు అధిక దిగుబడులు వస్తాయని కంపెనీ ప్రతినిధి ఏ.వి, నారాయణ అన్నారు. మండల పరిధిలోని నర్సన్నపేట గ్రామంలో రైతు వూడెం ఎల్లారెడ్డి రైతులు సాగుచేసిన రాయల్ సీడ్స్ కంపెనీ వారి రణధీర్ పత్తి పంట వ్యవసాయ క్షేత్రాన్ని మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 1220 మంది రైతులతో కలిసి వారు శుక్రవారం సందర్శించారు. రైతుల పత్తి పంటను ఆసక్తికరంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు ఒక చెట్టుకు 90 నుంచి 110 కాయలు వరకు రావడంతో పాటు ఎలాంటి చీడపురుగులు లేకుండా ప్రతి పంట, మిగతా పంటల కంటే ఎక్కువ పెరగడంతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. మండలంలో చాలా గ్రామాలలో రాయల్ సీడ్స్ వారి రణధీర్ ప్రతిని చాలా మంది రైతులు సాగు చేసేటందుకు ఉత్సాహంగా ఉన్నారన్నారు. పత్తి రైతు నాణ్యమైన రాయల్ సీడ్స్ పత్తి విత్తనాలను వాడాలని వారు సూచించారు. అనంతరం కంపెనీ వారు రైతులను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాయల్ సీడ్స్ కంపనీ ప్రతినిధులు ఆర్ఎంఆర్, వెంకట్, నర్సింలు, వంశీ, డిస్టిబూటర్స్, రాజారెడ్డి, ఆరోగ్య రెడ్డి, రాయల రెడ్డి, మాధవరెడ్డి, తదితరులున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై(ఐడీఓసీ)లో సమీక్షించారు

- జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి



నవతెలంగాణ-సిద్ధిపేట కలెక్టరేట్

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పురోగతిపై(ఐడీఓసీ)లో జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి అధికారులతో సమీక్షించారుఈ సందర్భంగా శుక్రవారం జిల్లా సమీకృత కార్యాలయంలో కలెక్టర్ మాట్లాడుతూ.. పాఠశాలల ఆధునీకరణకు సంబంధించి చేపట్టిన పనుల ఎంబి లను సకాలంలో అందించేలా చూడాలని, అదేవిధంగా ఈఈలు ఎంబీలను సబ్మిట్ చేయడంలో దృష్టి సారించాలని సూచించారు. ఇప్పటి వరకు మంజూరైన పనులు అందులో పూర్తయిన పనుల వివరాలను గురించి కలెక్టర్ వాకబు చేయడంతో పాటు వీలైనంతగా త్వరగా మంజూరు ఇచ్చిన పనులను పూర్తి చేసి నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, ఆర్అండ్బీ ఈఈ రాములు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

లింగ్ బూత్‌ను పరిశీలించిన తహసీల్దార్



నవతెలంగాణ-నంగునూరు

ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రములోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ జి.సరిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల కోసం అర్హులైన పట్టభద్రులందరు నవంబరు 6వ తేదీ లోపు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫారం 18 నందు అర్జిసమర్పించు కోవాలని సూచించారు. అర్హత తేదీ 2024 నవంబరు 1 కంటే మూడేళ్ల ముందు పట్టభద్రులు అయినవారు అర్హులుగా పరిగణించి బడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత



నవతెలంగాణ-సిద్ధిపేట

నైతిక విలువలు కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జామాయితే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్య క్షుడు ఖలేద్ ముబషీర్ ఉజ్ జఫర్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమాత్-ఎ-ఇస్లామీ హింద్ భారతదేశంలో 75 ఏళ్లుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. నిరుపేదలకు, వితంతువులకు ఆర్థిక సాయం అందించడం, అనాథలు, నిరాశ్రయులైన పిల్లలకు విద్యా సహాయం తదితర అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందన్నారు. తెలంగాణలో మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రులను, క్లినిక్‌లను నిర్వహిస్తూ పేదలకు ఉచితంగా వైద్యసేవలు కూడా అందిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన వక్ఫ్ (సవరణ) బిల్లు పై జమాత్ తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసిందన్నారు. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తుల స్వయంప్రతిపత్తిని, నిర్వహణను దెబ్బతీస్తుందని, ఈ బిల్లు మైనారిటీలకు రాజ్యాంగం ఇచ్చిన హామీలను కూడా విరుద్ధమని, దేశవ్యాప్తంగా వక్ఫ్ సంస్థల హక్కులను ఈ బిల్లు దెబ్బతీసే అవకాశం ఉందని జమాత్ భావిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు మొహమ్మద్ నయీమోద్దీన్ అహ్మద్, మీర్ జఫరుల్లా తహర్, అబ్దుల్ ఖుద్దుస్ పాల్గొన్నారు.

యాదమ్మ జ్ఞాపకార్థకంగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ ఎర్ర యాదమ్మ ఎనిమిదవ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి కుమారులు ఎర్ర ప్రకాష్ ,విజయ్ కుమార్, ఈశ్వరయ్య వృద్ధులకు గ్రామ ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 1995- 2001 వరకు మా అమ్మ ఎర్ర యాదమ్మ వెంకటాపూర్ సర్పంచ్‌గా పదవిలో కొనసాగారు. ఊరికి ఎన్నో అభివృద్ధి పనులు పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం గ్రామానికి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. సర్పంచిగా గ్రామ అభివృద్ధికి సేవ చేయాలని సహాయా సహకారాలు అందించాలని కోరుకునేది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు ముత్యాలవేందర్ రెడ్డి,గోపని లక్ష్మీ మల్లయ్య, రాజమహమ్మద్, గజ్జల ఎల్లయ్య, బీడీఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బేట ఆనంద్, షేక్ దస్తగిరి, కోటగిరి పాపయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-కొండపాక

అప్పుల బాధతో కలత చెందిన వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కొండపాకలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కొండపాకకు చెందిన శ్రీరామ్ మహేష్ (38) కులవృత్తి అయిన సెలూన్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల ఇంటి నిర్మాణం చేసి గృహప్రవేశం కూడా చేశాడు. ఇంటి నిర్మాణం కోసం మూడు లక్షల అప్పు చేశాడు. అప్పు ఎలా తీర్చాలో మనస్థాపానికి గురై కలత చెంది శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకున్నాడు. పై ఫ్లోర్‌కి వెళ్ళిన భార్య రమ వచ్చి చూసేసరికి వేలాడుతున్నాడు. వెంటనే కిందికి దించి సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. భార్య రమ ఫిర్యాదు మేరకు కుకునూరు పల్లి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడో, రోజు బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-నంగునూరు

తెలంగాణ ప్రజలు ఎంతో వైభవంగా నిర్వహించుకొనే బతు కమ్మ సంబరాల్లో మూడో రోజైన శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. ముద్ద పప్పు బతుకమ్మ పేరుతో వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చారు. సాయంత్రం ఆటపాటలతో మహిళలు సంబరాలు చేశారు. చిన్నలు నుంచి పెద్దల వరకు బతుకమ్మ ఆడుతూ పాడుతూ సంబరాలు చేసుకున్నారు.


ఆకట్టుకున్న చిన్నారి తమోజ్ఞ వల్లి అభినయం



నవతెలంగాణ-వర్గల్

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక, నృత్య కళా ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. హైదరాబాద్ కు చెందిన చిన్నారి సింగంశెట్టి తమోజ్ఞ వల్లి శుక్రవారం చేసిన నృత్య కళా ప్రదర్శన సబికులచే శెభాష్ అనిపించింది. గొల్లపల్లి లలిత ధనలక్ష్మి (లలిత ఫైన్ ఆర్ట్స్) వద్ద శిక్షణ పొందిన ఆ చిన్నారి భరతనాట్యంలో వివిధ ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులు పొంది పలువురు ప్రముఖులచే ప్రశంసలు అందుకుంది. కాగా వర్గల్ క్షేత్రం వద్ద హిందోళ రాగం ఆది తాళంలో మామతు శ్రీ సరస్వతి పాట ద్వారా తన విశేష అభినయాన్ని ప్రదర్శించి అమ్మవారి ఆశీస్సులు అందుకుంది. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు చిన్నారి తమోజ్ఞ వల్లిని అమ్మవారి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు.

గ్రేడ్-2 మున్సిపాలిటీగా గజ్వేల్



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్, ప్రజ్ఞాపూర్, ముట్రాజ్ పల్లి, క్యాసారం గ్రామపంచాయతీ కలుపుతూ గజ్వేల్ మున్సిపాలిటీ ఏర్పాటు చేశారు. 2012లో ఏర్పడిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ ప్రస్తుతం అప్ గ్రేడ్ పై అవకాశాలు ఉన్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరిగిన జనాభాకు మౌలిక సదుపాయాలు, పరిపాలన పరంగా సమస్యల పరిష్కారానికి గ్రేడ్-2 మున్సిపాలిటీ అవతరించనున్నది. ఇందులో భాగంగానే మల్లన్నసాగర్ నిర్వాసిత గ్రామాలైన పల్లెపహాడ్, వేములఘాట్, ఏటిగడ్డకిష్టాపూర్, ఎర్రవల్లి, సింగారంతోపాటు లక్ష్మాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజేరుపల్లి తదితర గ్రామాల ప్రజలకు మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్పల్లి, సంగాపూర్ గ్రామాల మధ్య ఆర్అండ్ఆర్ కాలనీని ఇందులోనే విలీనం చేయనున్నారు. దీంతో గ్రేడ్-2 గా మారే అవకాశం వచ్చింది.

2020 నుంచి ఇప్పటివరకు ఆయా గ్రామాలు పంచాయతీలుగానే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల పరిధిలో 15వేల జనాభా, మరో 13వేల మంది ఓటర్లు ఉన్నారు. తాజాగా పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్న వేళ.. ఈ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడానికి కసరత్తు మొదలైంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఇటీవల నిర్వాసితుల అభిప్రాయాలను తీసుకున్నది. ప్రజా ప్రతినిధులు, ముఖ్యుల అభిప్రాయాలను సేకరించగా, ఈ సందర్భంగా సానుకూలంగా వచ్చినట్లు అధికారుల ద్వారా సమాచారం.ప్రభుత్వం గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయడానికి మాత్రమే కసరత్తు ప్రారంభమైంది.

49 చదరం కిలోమీటర్ పరిధితో..

గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధి ప్రస్తుతం 49 చదరపు కిలోమీటర్ల పరిధి కలిగి ఉంది. ఇప్పుడు మున్సిపాలిటీలో గజ్వేల్, ప్రజ్ఞాపూర్, రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, క్యాసారం, ముట్రాజ్ పల్లి గ్రామాలు ఉన్నాయి. దీంతో పట్టణ జనాభా 55 వేలకు చేరుకుంది. ఆర్అండ్ఆర్ కాలనీ విలీనం అయితే జనాభా 70 వేలకు చేరుకోనున్నది. ప్రస్తుతం వార్డుల సంఖ్య 20 ఉండగా, మరో 15వార్డుల అదనంగా పెరగనున్నాయి. దీని ద్వారా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ గ్రేడ్-2 మున్సిపాలిటీగా అవతరించనున్నది.

పాత ప్రతిపాదనకు బ్రేక్.

గతంలో గ్రేడ్-1 ప్రతిపాదనకు బ్రేక్ పడిందని చెప్పాలి. ఈ మున్సిపాలిటీని గ్రేడ్-1 మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడానికి 2018లో ప్రతిపాదనలు తయారు చేశారు. మున్సిపాలిటీ సరిహద్దు నుంచి 5కిలోమీటర్లలోపు దూరంలో ఉన్న అక్కారం, ధర్మా రెడ్డిపల్లి, జాలిగామ, బయ్యారం, కోమటిబండ, శ్రీగిరిపల్లి, దాచారం, రిమ్మనగూడ, పాతూర్ గ్రామాలను విలీనం చేయాలని ప్రతిపాదించారు. ఈ గ్రామాల విలీనంతో జనాభా 80వేలకు పెరిగినా, పట్టణ వైశాల్యం భారీగా 138 చదరపు కిలోమీటర్లకు పెరనుందని, దీని వల్ల సమస్యలు తలెత్తుతాయని మున్సిపల్ శాఖ గుర్తించింది. కార్పొరేషన్ స్థాయిలో వైశాల్యం పెంచినా జనాభా 80వేలే ఉండటం మరో మైనస్ పాయింట్ మారింది. కొత్తగా విలీనమయ్యే 9 గ్రామాల ప్రజలు మున్సిపల్ విధానాన్ని అలవాటుపడక, పన్నుల పెరిగి ఇబ్బందులు వస్తాయని కూడా గుర్తించారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా ఉండి.. కార్పొరేషన్ వైపు అడుగులు వేస్తున్న జిల్లా కేంద్ర మైన సిద్ధిపేట ప్రస్తుత వైశ్యాలం 36,09 చదరపు కిలోమీటర్లు మాత్రమే. కానీ గజ్వేల్ గ్రేడ్ -1 మున్సిపాలిటీగా అప్గ్రేడ్ చేస్తే వైశాల్యం అసాధారణంగా ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యానికి భంగం వాటిల్లే ప్రమాదముందని మున్సిపల్ శాఖ రాష్ట అధికారులు గుర్తించారు. దీనివల్ల గతంలో ఈ ప్రతిపాదనను పక్కన పెట్టారు. కాగా మల్లన్న సాగర్ విలీనంతో గ్రేడ్-2 మున్సిపాలిటీగా మారనున్నది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించండి



నవతెలంగాణ-కొండపాక

సంపద సృష్టించే కార్మిక, కర్షక అనుకూల విధానాలను వీడి పెట్టుబడిదారీ కార్పొరేట్ విధానాలను ప్రోత్సహించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై సీపీఐ(ఎం) నిరంతరం పోరాడుతుందని జిల్లా కమిటీ సభ్యులు అమ్ముల బాల నర్సయ్య అన్నారు. కుసూరు పల్లి మండలం తిప్పారం గ్రామ మహాసభ సాయికుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన బాల్ నర్సయ్య మాట్లాడుతూ.. నేడు దేశంలో కార్మిక వర్గం, రైతులు, శ్రామిక ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్ల రైతుల, కార్మికుల, శ్రామిక ప్రజల బతుకులు దుర్భరంగా దిగజారిపోతున్నాయి. ఈ కార్పొరేటు అనుకూల విధానాలను అమలు చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడా సంపన్న కార్పొరేట్‌లకే కొమ్ముగాస్తున్నాయన్నారు. దీనిపై శ్రామికులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములు కావాలన్నారు. అంతిమంగా కార్మికుల, కర్షకులదే విజయమని సీపీఐ(ఎం) నిర్వహించే పోరాటాల్లో కార్మికులు కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పోరాడాలని అన్నారు. నేడు దేశంలో ఉన్న బూర్జువా పార్టీలను ప్రతిఘటించిన నాడే కార్మికుల, కర్షకులకు అనుకూల పరిస్థితులు సాధ్యమైతాయని దోపిడి విధానం పోయి సమ సమాజం సిద్ధిస్తుందని నిత్యం కార్మికుల కోసం, కర్షకుల కోసం నిర్వహించే పోరాటాల్లో శ్రామికులు, కర్షకులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా పి. నరహరిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అదేవిధంగా సోషల్ మీడియా ఇన్చార్జిగా సాయికుమార్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు తాటోజు రవీంద్ర చారి, గ్రామ సభ్యులు, ఆమ్మార్తి ఎల్లయ్య, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకం

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే జంగయ్య



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణలో ఉపాధ్యాయుల భాగస్వామ్యం అత్యంత ఆవశ్యకమని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కే జంగయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అధ్యయన తరగతులను స్థానిక ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సమాజం పట్ల, సంఘం పట్ల లోతైన అవగాహన ఉండాలని, అందుకు ఈ అధ్యయన తరగతులు ఉపయోగపడతాయని అన్నారు. వివిధ రకాల కారణాల రీత్యా రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతుందని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డ తొలినాలల్లో టీఎస్ యూటీఎఫ్ ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కొరకు విలువైన సూచనలు చేస్తూ 2014 సెప్టెంబర్ 24న రాష్ట్ర ప్రభుత్వానికి డాక్యుమెంట్ అందించడం జరిగిందన్నారు. నేటి వరకు ప్రభుత్వాలు కొన్నింటిని పాటిస్తున్నాయని, పాఠశాలల పరిరక్షణ కొరకు ఇటీవల విద్యా కమిషన్ కు కూడా పలు సూచన అందించడం జరిగిందని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్ ప్రతి కార్యకర్త ప్రభుత్వ పాఠశాల నిరంతరం పాటుపడాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యారంగా పరిణామాలు అనే అంశంపై కార్యకర్తలకు తరగతిని బోధించారు. భోజన విరామ సమయం అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి సంఘ నిర్మాణం -పని పద్ధతులు, లీవ్ రూల్స్ పై తరగతిని బోధించారు. అన్ని రకాల లీవ్స్ పైన లోతైన అవగాహన కల్పించారు. కార్యకర్తలకు టీఎస్ యూటీఎఫ్ ను బలమైన సంఘంగా జిల్లాలో నిలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలీ అహ్మద్, తప్పెట్ల యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు చిర్రా యాదగిరి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. ప్రభావతి, జిల్లా కోశాధికారి ఎం. కృష్ణ, జిల్లా కార్యదర్శులు బి . నిర్మల, జి. వెంకట కిరణ్, కొడిపల్లి ప్రశాంత్ కుమార్, దేవులపల్లి గిరిబాబు, కే కనకరాజు, ఎల్ యాదయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్ టీ. శివలింగం, జిల్లా పూర్వ అధ్యక్షులు పి. నగేష్, మైనార్టీ గురుకులాల రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. రాజిరెడ్డి వివిధ మండలాల నాయకులు మహేశ్వరి, వసంత పాల్గొన్నారు.

అంధకారంలో చేర్యాల పట్టణ రహదారి

- పండుగ పూటైనా లైట్లు వేయాలని కోరుతున్న ప్రజలు



నవతెలంగాణ-చేర్యాల

పట్టణ కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాత్రి సమయాల్లో లైట్లు లేకపోవడంతో పూర్తిగా అంధకారంగా మారిన పరిస్థితి నెలకొంది. దీంతో రాత్రివేళల్లో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేర్యాల పట్టణంలో జనగామ సిద్దిపేట ప్రధాన జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పాతరోడ్డును తొలగించి కొత్తగా రోడ్డు వేసే క్రమంలో పట్టణంలోని ప్రధాన రహదారిపై గతంలో డివైడర్లో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ కనెక్షన్లు దెబ్బతిన్నాయి. కాగా నేషనల్ హైవే అధికారులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి ఆరు నెలలు గడుస్తున్న సెంట్రల్ లైటింగ్ కనెక్షన్లను సరిచేయకపోగా, మున్సిపల్ అధికారులు ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా తాత్కాలికంగా లైట్లను సైతం ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో వాహనాలు అదుపు తప్పి పలువురు రోడ్డు ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా లేకపోలేదు. బతుకమ్మ పండుగ ప్రారంభం కావడంతో పట్టణంలోని అన్ని వీధుల్లో బతుకమ్మలు ఆడి కుడి చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేయడానికి మహిళలు ఈ ప్రధాన రహదారి గుండానే వెళ్తుండడంతో ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఒకవైపు బతుకమ్మ, దసరా సెలవులు కావడంతో ప్రజలు పెద్ద ఎత్తున గ్రామాలకు చేరుకుంటున్నారు. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు పెరిగే అవకాశం ఉండడం, మరోవైపు రోడ్డు విస్తరణ పనులు పూర్తికాకపోవడం రాత్రి వేళల్లో లైట్లు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ప్రధాన రహదారిపై తాత్కాలికంగానైన లైట్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బతకమ్మ ఆడడానికి స్థలము లేక ఇబ్బంది పడుతున్న మహిళలు



నవతెలంగాణ-కొండపాక

మండలం వెలికట్ట గ్రామంలో ఆడపడుచుల సంబరమైన పండుగ బతుకమ్మ ఆడటానికి స్థలం లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి అమ్ముల బాల్ నర్సయ్య అన్నారు. శుక్రవారం గ్రామ (శాఖ)కమిటీ సమావేశం వెలికట్టలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామకంఠం, ప్రభుత్వ స్థలంలో బత్తకమ్మ అడుకోవడానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ, సామాజిక అనుబంధాల సమహారమే ఈ పండగాని సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన పండుగ బతుకమ్మ అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. అన్నం పెట్టే మట్టిని గౌరవిస్తూ పూలను పూజిస్తూ మహిళలంతా కలిసి ఆడి పాడడం ఒక బతుకమ్మలోనే మనకు అగుపిస్తుందని బతకమ్మ అని కోరుకునే పండగ అందుకే దీన్ని మహిళలు పండుగ అంటారు. ఇలాంటి పండుగకు మహిళలు ఆడపడుచులు ఆడుకోవడానికి స్థలం లేక బజార్‌లో పెట్టి ఆడవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వాహనదారులకు రావడానికి పోవడానికి అనేక ఇబ్బందులు పడవలసివస్తుందన్నారు. గ్రామంలో కావలసిన ఆట స్థలము ఉన్నదని గతంలోగ్రామపంచాయతీ దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకునే పాపాన పోలేదు. గ్రామ కార్యదర్శి నర్సింలుకు గ్రామ పంచాయతీ గ్రామ కంఠం, ప్రభుత్వ స్థలం ఉందని చరవాణి ద్వారా సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి బతుకమ్మ ఆడపిల్ల స్థలంలోని పిచ్చి చెట్లను, గడి, చెత్తను, తొలగించి శుభ్రం చేస్తామని హామినిచ్చారు. సీపీఐ(ఎం) నాయకులు, అంబేద్కర్ ఆశయ సాధన సంఘం, సభ్యులు మహిళలు(మాల) సీపీఐ(ఎం) వెలికట్ట గ్రామ కమిటీ సమావేశంలో తీర్మానించి డిమాండ్ చేయడం జరిగింది. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో చేస్తామన్నారు. ఈ సమావేశానికి కొమరవెల్లి కనకయ్య అధ్యక్షతన వహించారు. ఈ కార్యక్రమంలో పెరుగు కొమురయ్య, అమ్ముల కనకయ్య, అమ్ముల పరశురాములు, దొమ్మాట బెల్లమయ్య, ఎర్రబోయిన చంద్రయ్య, అమ్ముల బాలలక్ష్మి, బర్మ భారతి, బాలమణి, కొమురయ్యపాల్గొన్నారు

భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పొందిన సంపత్



నవతెలంగాణ-కోహెడ

మండలంలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పిడిశెట్టి సంపత్ శుక్రవారం భౌతికశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. తల్లిదండ్రులు పిడిశెట్టి లక్ష్మి భూమయ్య సహకారంతో చిన్ననాటి నుంచి చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అలాగే పీజీ, బీఈడీ పూర్తి చేసిన ఆయన యూజీసీ నెట్‌లో ఆలిండియా 87వ ర్యాంకు సాధించి ఉస్మానియా యూనివర్సిటీలో సీనియర్ ప్రొఫెసర్ కరుణాసాగర్ ఆధ్వర్యంలో భౌతికశాస్త్రంలో పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ అందించినట్లు ఆయన తెలిపారు. అలాగే వరుసగా ట్రైబల్ వెల్ఫేర్ లో టీజీటీ ఉద్యోగం, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్ 2 ఉద్యోగం, మైనార్టీ గురుకుల సొసైటీలో ప్రిన్సిపాల్‌గా మూడు ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం తిమ్మాపూర్‌లోని మానకొండూర్ మైనారిటీ గురుకుల ప్రిన్సిపాల్‌గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామస్థులు, మండల ప్రజలు అభినందనలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణను ప్రస్తుత డీఎస్సీ నియమకాల్లో అమలు చేయాలి



నవతెలంగాణ-నంగునూరు

ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణను ప్రస్తుత డీఎస్సీ నియమకాల్లో అమలు పరచాలని మండల బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల కో ఆర్డినేటర్ తప్పేట పర్షరాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి గత ఆగస్టు నెల 1వ తేదీనా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజల్లో దశాబ్దాల కల సాకారం అయిందని అందరికి రిజర్వేషన్ ఫలాలు అందుతాయని అనుకునే లోపే డీఎస్సీ ఫలితాలు ప్రకటించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా ఫలితాలు ప్రకటించడం జరిగిందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును మేము వెంటనే అమలు చేస్తామని, నిండు అసెంబ్లీలో తెలంగాణ ప్రజలందరి ముందు వెంటనే అమలు చేస్తామని చెప్పి తరువాత ఇచ్చిన మాట మార్చడం ఇది కాంగ్రెస్‌కి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అలవాటైందని ఆరోపించారు. ఇప్పటికైనా నియామక ప్రక్రియ పత్రాలు ఇచ్చే లోపు తమ తప్పును సరిచేసుకొని ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ ప్రకారం నియామక పత్రాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో తర్వాత జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరం

- డీసీసీ చైర్మెన్ తూముకుంట నర్సారెడ్డి

నవతెలంగాణ-వర్గల్

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం లాంటిదని, దానిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, రాష్ట్రంలోని పేదలందరికీ కార్పొరేట్ వైద్యం అందాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. వేలూరులో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యంగా పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఇందుకోసం రాష్ట్ర ఖజానాపై భారం పడుతున్నప్పటికీ వారి జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రధాన ధ్యేయంగా ముందుకెళుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్ రెడ్డి, నాయకులు తోట ముత్యాలు, కీసర వెంకటేష్, గోవర్ధన్ రెడ్డి, బాలైడ్డి తదితరులు పాల్గొన్నారు.



రెడ్డి ప్రజా ప్రతినిధుల సన్మాన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-నంగునూరు

ఈ నెల 6న రెడ్డి ప్రజా ప్రతినిధుల సన్మాన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని సిద్దిపేట రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు ఐలేని మల్లికార్జునరెడ్డి, యూత్ అధ్యక్షులు డాకూరి భాస్కర్ రెడ్డి పిలుపునిచ్చారు. నంగునూరు మండలం నాగరాజు పల్లి, నంగునూరు గ్రామాల్లో శుక్రవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 6 న హైదరాబాదు లోని శిల్పకళా వేదికలో రెడ్డి ప్రజాప్రతి నిధులకు సన్మాన మహోత్సవ కార్యక్రమం ఉంటుం దన్నారు. జిల్లాలోని రెడ్డి సంఘం ప్రజా ప్రతినిధులు, రెడ్డి సంఘం నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాల్ రెడ్డి, పద్మ, వివిధ గ్రామాల రెడ్డి సంఘం అధ్యక్షులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ తయారీలో నార్ల వారి ప్రత్యేకత



నవతెలంగాణ-సిద్దిపేట

బతుకమ్మ పండుగ వచ్చిందంటే తొమ్మిది రోజులు తొమ్మిది రకాల బతుకమ్మలను పేర్చి నార్ల చంద్రయ్య కుటుంబం పట్టణంలో తమ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. గత కొన్నేళ్లుగా తొమ్మిది రోజులు సరస్వతి, లక్ష్మీ మాత, శివుడు, వెంకటేశ్వర స్వామి, పార్వతీ మాత ఇలా రకరకాల ప్రతిమలను బతుకమ్మ మధ్యలో ఏర్పాటు చేసి, ప్రత్యేకంగా బతుకమ్మలను అలంకరించి నార్ల చంద్రయ్య కుటుంబ సభ్యులు నాగరాజు, శివకు మార్లు ప్రత్యేకతను చాటుతున్నారు

ఎకనామిక్స్‌లో రమేష్‌కు పీహెచ్‌డీ పట్టా



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రానికి చెందిన కమాన్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు జాలిగాం రమేష్‌కు శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఎస్. నరసింహాచారి డాక్టరేట్ ప్రకటించారు. తెలంగాణలోని పాక్షిక శుష్క మండలాల్లో నీటిపారుదల, యాంత్రీకరణ, వ్యవసాయ వృద్ధి అనే అంశంపై రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్. విజయ పర్యవేక్షణలో పరిశోధనను పూర్తి చేశారు. ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల కమాన్‌పూర్‌లో జూనియర్ లెక్చరర్‌గా సేవలందిస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కళాశాల ప్రిన్సిపాల్ కె.సుధాకర్, అధ్యాపకులు, గ్రామస్థులు, పలువురు అభినందించారు.

తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయండి



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ ప్రజా ఫ్రంట్ 15వ ఆవిర్భావ సదస్సును జయప్రదం చేయండని తెలంగాణ ప్రజా ఫ్రంట్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు జంగిటి నరసింహులు ప్రజలను కోరారు. ఆవిర్భావ సదస్సు కరపత్రాన్ని శుక్రవారం అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 9 ఉదయం 10 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాగ్ లింగంపల్లిలో సదస్సు జరుగుతుందని తెలిపారు. ఈ సదస్సులో ప్రారంభో ఉపన్యాసం ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక తరపున మాట్లాడుతారని, ప్రొఫెసర్ కాశీం ప్రజాస్వామిక తెలంగాణ ప్రజా ఫ్రంట్ గూర్చి ఉపన్యసిస్తారని తెలిపారు. ప్రజా ఉద్యమాలు నిర్బంధం ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడతారని, మహిళలు, దళితులపై జరుగుతున్న మనువాదుల దాడులు పై కాత్యాయని విద్మహే ఉపన్యసిస్తారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలనా విధానాలపై ఎన్ వేణుగోపాల్ వీక్షణం సంపాదకులు మాట్లాడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్రంట్ నాయకులు సత్తయ్య, దుర్గారాములు, విజయ్ పాల్గొన్నారు.

రక్షిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ-బెజ్జంకి

నిరుపేదలకు కార్పోరేట్ వైద్య అందించడమే ధ్యేయంగా అందుబాటులో రక్షిత కేర్ ఆస్పత్రి ఏర్పాటు చేశామని..ఉచితంగా నిర్వహించిన రక్షిత వైద్య శిభిరానికి విశేష స్పందన లభించిదని చేర్యాల రవీందర్ ఆనందం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని రక్షిత కేర్ ఆస్పత్రిలో డాక్టర్ శ్రీధర్ రెడ్డి అధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించారు. సుమారు 100 మంది రోగులకు మధుమేహ, రక్తపోటు పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. ఆస్పత్రి సిబ్బంది సందీప్,సాయి కృష్ణ,మార్త తదితరులు ఉన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-బెజ్జంకి

అనారోగ్యంతో బాధపడుతూ మేరుగైన వైద్య చికిత్సకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన సుమారు రూ.10.76 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో సుమారు 37 బాధితులకు పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ పులి కృష్ణ, పార్టీ మండలాధ్యక్షుడు రత్నాకర్ రెడ్డి, బ్లాక్ అధ్యక్షుడు దామోదర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బండిపల్లి రాజు, పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పులి సంతోష్, బైర సంతోష్ ఉన్నారు.

విద్యుద్ఘాతంతో గెదె మృత్యువాత

నవతెలంగాణ-మర్కుక్



విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో , విద్యుద్ఘాతానికి గురై గెదె మృత్యువాత చెందిన సంఘటన మర్కుక్ మండలం భావానందపూర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్ట యాదగిరికి చెందిన గెదె ప్రక్కన ఉన్న బావి వద్దకు మేతకు వెళ్ళింది. అక్కడ విద్యుత్ స్తంభం పై ఉన్న విద్యుత్ తీగలు తెగిపడి ఫినిషింగ్ వైర్ పై పడటంతో అక్కడే మేస్తున్న గెదెకు తీగలు తగలడంతో విద్యుద్ఘాతానికి గురై గెదె అక్కడికక్కడే మృతి చెందింది. గత వారం రోజుల నుంచి స్తంభం పైన తీగలు లూస్ అవుతుందని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చిన స్పందించి పోవడం వల్ల గెదె మృత్యువాత చెందిందని బాధిత రైతు ఆరోపించారు. గెదె విలువ సుమారు రూ.ఒక లక్ష ఉంటుందని, నిరుపేద కుటుంబాన్ని చెందిన పాడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు. నిర్లక్ష్యం వహించిన విద్యుత్ అధికారుల పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని రైతులు ఆరోపించారు.

వ్యభిచార గృహం పై పోలీసుల దాడి

- నలుగురు విటులు, ఒక మహిళ అరెస్ట్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

వ్యభిచార గృహం పై దాడి చేసి నలుగురు విటులతో పాటు, ఒక మహిళ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట పట్టణం శివాజీ నగర్‌లో ఓ ఇంట్లో చంద్రమౌళి అనే వ్యక్తి ఆడవారిని తీసుకొని వచ్చి వ్యభిచారం నడిపిస్తున్నాడన్న నమ్మదగిన సమాచారం పై వన్ టౌన్ పోలీసులతో కలసి వెళ్లి దాడి చేసి నలుగురు విటులను, ఒక మహిళను అదుపులోకి తీసుకోగా, మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, వారి వద్ద నుంచి రూ.2వేల నగదు, 6 సెల్ సెల్ ఫోన్స్, ఒక బైక్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేడు ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

నవతెలంగాణ-దుబ్బాక

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా జరిగిన పనులపై దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వేలేటి భాస్కర శర్మ తెలిపారు. గతేడాది ఏప్రిల్ 1 వ తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు దుబ్బాక మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ బృందాల ద్వారా తనిఖీ నిర్వహించబడి తుది నివేదిక సమర్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి చెందిన కడవెరుగు యశోద (75) గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో మృతురాలి కుటుంబాన్న మాజీ ఉపసర్పంచ్, చేర్యాల ఏఎంసీ మాజీ డైరెక్టర్ శనిగరం సత్యనారాయణ, శుక్రవారం పరామర్శించారు. మృతురాలి కుమార్తె సులోచనకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగరం కనకయ్య, మోకు కనకారెడ్డి, మంతెన శ్రీపతి రెడ్డి, కడవేరు సుదర్శన్, ఆడెపు శ్రీనివాస్, ఆడెపు రాజు, తదితరులు ఉన్నారు.

కర్బుజ కాయ మీద అమ్మవారి అద్భుత చిత్రాన్ని చిత్రించారు


నవతెలంగాణ-గజ్వేల్



దుర్గాదేవి శరన్నవరాత్రులు పురస్కరించుకుని కర్బుజ కాయ మీద కళానైపుణ్యంతో అమ్మ వారి చిత్రాన్ని అద్భుతంగా చిత్రించి రామకోటి కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించి పూజించారు. గజ్వేల్‌కు చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యకులు, భక్తిరత్న, కళారత్న, సేవారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దుర్గాదేవి నవరాత్రులు కూడా భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తారన్నారు. మహిళలందరు కూడా వడిబియ్యం సమర్పించుకుంటారన్నారు. ఆది పరాశక్తిని నియమ నిష్ఠలతో 9రోజులు భక్తులు మాల ధరించి దీక్ష వహిస్తారు. జై దుర్గామాత నామాన్ని స్మరిస్తూంటారు. కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా భక్తులు కొల్చుకుంటారన్నారు.

గాయత్రి దేవిగా దర్శనమిచ్చిన దుర్గామాత

నవతెలంగాణ-రాయపోల్



దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం దుర్గామాత గాయత్రీ దేవిగా దర్శన మిచ్చారు. రాయపోల్ మండల పరిధిలోని రాయపోల్, వడ్డేపల్లి, అరేపల్లి ,అనాజీపూర్ తదితర గ్రామాల్లో దుర్గ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత మండపాల్లో సుందరంగా ముస్తాబు చేసి భక్తి శ్రద్ధలతో భక్తులు నిర్వాహకులు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దుర్గామాత నవరాత్రుల సందర్భంగా యువకులు దుర్గామాత మాల ధరించి నిష్ఠపూజలతో గాయత్రిదేవిని కొలుస్తున్నారు.

జడ్పీహెచ్ఎస్ పాత భవనంలో సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి



నవతెలంగాణ- సిద్దిపేట కలెక్టరేట్

సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లా సైన్స్ ఫోరం, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ చర్చించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ పాఠశాల పాత భవనంలో ఏర్పాటు చేసి సైన్స్ సెంటర్ ఆవశ్యకత, సైన్స్ సెంటర్ ఏ విధంగా రూపొందించాలి. సైన్స్ సెంటర్లో ఉండాల్సిన అంశాలు, వివిధ రకాల సలహాలు, సూచనలు చేశారు. సైన్స్ సెంటర్లో ఉండే ప్రాజెక్టు వర్కింగ్ మోడల్‌గా ఉండాలని, సైన్సు సెంటర్ అనేది పాఠశాల స్థాయికి, కళాశాల స్థాయికి, సమాజం నుంచి వచ్చే ప్రతి పౌరులు నేర్చుకునే విధంగా సైన్స్ సెంటర్ ఉండాలని సూచించారు. సమాజంలోని అన్ని వర్గాల వారు సైన్స్ సెంటర్‌ను సందర్శించే విధంగా ఉండాలని, చదువుకోని వారికిసైతం విషయ అవగాహన పెంపోందే విదంగా ఉండాలి. సైన్స్ సెంటర్‌ను సందర్శిస్తే కొత్త శాస్త్రీయ విజ్ఞానాన్ని పొందే విధంగా ఉండాలని సూచించారు. అత్యాధునిక పద్ధతిలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలగలుపేసుకుని ఒక మాడల్ సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అన్ని విధాల సహకారం ఉంటుందని తెలిపారు. దీనికోసం వివిద ప్రాంతాల్లో వివిద రకాల సైన్స్ మ్యూజియంలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఒక నివేదిక ప్రకారం మాడల్ వన్ సైన్స్ సెంటర్ తయారికి ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, భౌతిక శాస్త్రం ఫోరం, జీవశాస్త్ర ఫోరం, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసును చేదించిన పోలీసులు

- 7 గురు నిందితుల అరెస్ట్..రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-బెజ్జంకి

ఆర్థిక లావాదేవీల వ్యవహారంలో సోమని ప్రవీన్ పై కత్తితో దాడిచేసి గాయపర్చిన 7 గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్టు ఎస్ఐ క్రిష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసు వివరాలను ఎస్ఐ వెల్లడించారు. మండల కేంద్రానికి చెందిన సోమని ప్రవీణ్ ఉపాధి కోసం కోరుట్లలో నివాసం ఉంటున్నాడు. ప్రవీణ్ తన స్వంత కారులో గురువారం ఉదయం కొరుట్ల నుంచి హైదరాబాద్ కారు యందు వెళ్తుండగా బెజ్జంకి గ్రామానికి చెందిన వేల్పుల శ్రీనివాస్, వేల్పుల శ్రీకాంత్, చందు, కరీంనగర్ కు చెందిన హరీష్, మహేందర్, బెజ్జంకి చెందిన సందీప్, శ్రీహరి తోటపల్లి శివారులోని రామాలయం వద్ద అడ్డగించి కార్లో ఉన్న ప్రయాణికులను పారిపొమ్మని బెదిరింపులకు పాల్పడ్డారు. సోమని ప్రవీన్ పై శ్రీకాంత్, శ్రీను, చందు హరీశ్ కత్తితో పలుమార్లు దాడి చేసి శంకర్ నగర్ రాజీవ్ రహదారి పై వదిలి వెళ్లిపోయారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు ప్రవీణ్‌ను సిద్దిపేట, అనంతరం నిమ్స్ హాస్పిటల్ కు తరలించి, నిందితుల కోసం పోలీసులు పలు బృందాలుగా ఏర్పడి హత్యాయత్నం చేసిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నిందితులను అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రవీణ్ నగదు ఇవ్వాలని పలుమార్లు అడిగిన స్పందించక పోవడంతో ఈ దాడికి పాల్పడినట్లు నిందితులు తెలిపారు. సంఘటనకు వాడుకున్న రెండు కార్లు,7 సెల్ ఫోన్లు, కత్తిని స్వాధీనం చేసుకుని నిందితులను జ్యూడీషియల్ కస్టడీకి హుస్నాబాద్ కోర్టులో హాజరు పరిచినట్లు పోలీసులు తెలిపారు.

పండుగ ఏర్పట్లను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

బతుకమ్మ పండుగ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఏర్పట్లను పరిశీలించారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు బతుకమ్మ పండుగ సందర్భంగా ఏర్పాట్లను గ్రామ కాంగ్రెస్ నాయకులతో కలిసి సీనియర్ నాయకులు పంది రాజు శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చెరువులోకి వెళ్లే దారిలో ఉన్న పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించాలని గ్రామ పంచాయతీ సిబ్బందిని కోరారు. చెరువులో చేసిన ఏర్పాట్లను, అవసరమైన లైటింగ్ ఏర్పాటు చేయాలనీ, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. గ్రామస్తులు సమన్వయంతో పని చేసి బతుకమ్మ దసరా పండుగలను విజయవంతంగా చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు బెజనమైన అనిల్, మాజీ సర్పంచ్ పాతుకుల లీలాదేవి వెంకటేశం, ఎన్ఎస్యుఐ మండల అధ్యక్షులు ప్రవీణ్, గ్రామ అధ్యక్షులు సంతోష్, మైనార్టీ సెల్ అధ్యక్షులు షఫీ, సీనియర్ నాయకులు రాములు, యువజన నాయకులు భాను చందర్, ప్రశాంత్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పంటకు బలం

- అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్



నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చని అర్బన్ మండల వ్యవసాయ అధికారి శ్రీనాథ్ అన్నారు. మండల పరిధిలోని బక్రిచెప్యాల, రంగధాంపల్లి లో విత్తనోత్పత్తి వరి, జీలుగ పంటలను శుక్రవారం పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. ప్రతి పంటను సాగు చేయడానికి 45 రోజుల ముందు పచ్చి రొట్ట పైర్లు అయిన జనము జీలుగ పిల్లి పెసర వంటి వాటిని పొలంలో పెంచి పూత దశలో భూమిలో కలియ దున్నడం ద్వారా పంటకు ప్రధాన పోషకాలు ఎక్కువ మొత్తంలో అందుతాయని తెలిపారు. పచ్చిరొట్ట వ్యర్థాలు భూమిలో కుళ్ళి మంచి ఎరువుగా మారి భూసారం పెరుగుతుందని తెలిపారు. ప్రతి రైతు పచ్చిరొట్ట పైర్లను పెంచి భూమిలో కలియ దున్నుకోవడం ద్వారా ఎరువుల వినియోగాన్ని తగ్గించుకోవచ్చని తద్వారా ఖర్చు తగ్గుతుందని సూచించారు. పంటలకు ఆశించే తెగులు, చీడపీడల నివారణకు వ్యవసాయ అధికారులు అందించే సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రాజేష్, పవన్ ఉన్నారు.

ఇందూరులో బతుకమ్మ సందడి

- ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థినులు



నవతెలంగాణ- సిద్దిపేట అర్బన్

నిత్యం కంప్యూటర్లతో కుస్తీ పట్టే ఇంజినీరింగ్ విద్యార్థినులు బతుకమ్మ ఆటా పాటలతో హోరెత్తించారు. కోలాటం ఆడుతూ సందడి చేశారు. ఆధునిక వస్త్రధారణపై మక్కువ చూపే యువతులు సాంప్రదాయ దుస్తుల్లో తళుక్కుమన్నారు. ఈ దృశ్యం సిద్దిపేట శివారు ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆవిష్కృతమైంది. కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుక ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగింది. చీరెలు, పరికిణీలు ధరించి తెలంగాణ సాంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఇందూరు కళాశాలలో దాదాపు 250 మంది విద్యార్థినులు బతుకమ్మ వేడుకలో మునిగితేలారు పాటలకు అనుగుణంగా లయబద్ధంగా చేతులు కదుపుతూ కేరింతలు కొట్టారు. మహిళా స్టాఫ్ మెంబర్స్ కూడా వీరితో జతకట్టారు. కోలాటం కూడా ఆడడంతో కళాశాల ఆవరణ సందడిగా మారింది ఎక్కడ చూసినా ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి పి రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, పీఆర్ఓ బొడ్డు రఘు, ప్రోగ్రాం కోఆర్డినేటర్ - స్ఫూర్తి, కిరణ్మై, మానస, శ్రీలత, త్రివేణి వివిధ డిపార్ట్మెంట్ హెచ్ఓడీస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ





నవతెలంగాణ-రాయపోల్

తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయినా బతుకమ్మ పండుగను కేవలం తెలంగాణ రాష్ట్రంలోనే నిర్వహించడం జరుగుతుందని ఇందుప్రియాల్ అంగన్వాడి టీచర్ మహమ్మద్ సుల్తానా అన్నారు. దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ అంగన్వాడి కేంద్రంలో బతుకమ్మ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. సాంస్కృతి,సంప్రదాయాలను మరచిపోతున్న నేటి కాలంలో వాటిని గుర్తు చేయడం పాఠశాలల కర్తవ్యంగా భావిస్తూ ప్రాచీన సంప్రదాయం సాహిత్యాన్ని పరిరక్షించుకోవాలని తంగేడు, గునుగు, చామంతి తోపాటు తీరొక్క పూవులతో బతుకమ్మ తయారుచేసి కోలాటాలతో బతుకమ్మ ఆటపాటలతో విద్యార్థులు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు మంజుల, సువర్ణ, మహిళలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

ఈజీఎస్‌లో 2024 -25 కొత్త పనులు గుర్తించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

సమికృత జిల్లా కార్యాలయ సముదాయం లోనీ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 2024 -25 ఏడాదిలో ఈజీఎస్‌లో చేపట్టబోయే పనుల గుర్చి ఏపీఓ, ఈసీ, టీఏ, ఈజీఎస్ సిబ్బందికి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంకి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. 2024-25 ఏడాదికి కొత్త పనుల గుర్తించడం, క్రితం ఏడాది చేపట్టిన పనులు సైతం పూర్తి చెయ్యాలి. ఎన్ఆర్ఈజీఎస్‌లో కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. లబ్దిదారులకు సకాలంలో పనులను కల్పించాలి. అలాగే గ్రామల్లో నర్సరిలకు స్థల అన్వేషణ చేసుకుని భూమిని చదును చెసి ఎక్కువ శాతం ఈత, తాటి, మొరియా విత్తనాలను సెకరించుకుని ఎర్రమట్టి, నల్లమట్టి లను సమకూర్చుకోవాలి. జిల్లాలో శనిగరం, సింగరాయ, కొండ, తపాస్ పల్లి జలశయాలలో డిస్ట్రిబ్యూషన్ కెనాల్లను పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు ప్రక్రియ కోసం ఇరిగేషన్, ఈజీస్ అధికా రులు కలిసి ఈజీఎస్‌లొ పనులను పూర్తి చేసెందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామి ణాబివృద్ధి శాఖ అధికారి జయదేవ్ ఆర్యా, అడిషనల్ పిడి బాలకృష్ణ, ఏపీడీ శివాజీ, క్యూసిలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ట్రాఫిక్ నిబంధనలు నేర్చుకోవడం చాలా ముఖ్యం

- మైనర్ డ్రైవింగ్ చట్ట ప్రకారం నేరం, ప్రమాదకరం
- ట్రాఫిక్ సీఐ మురళి



నవతెలంగాణ-గజ్వేల్ రూరల్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రోడ్డు నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తక్కువగా జరిగే అవకాశం ఉంటుందని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ మురళి అన్నారు. గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ 33 తెలంగాణ బెటాలియన్ సంగారెడ్డి వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్సీసీ విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోటార్ సైకిల్ వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం హెల్మెట్ లేకపోవడమేనని, అతివేగం నిద్రలేమి తనముతో వాహనాలు డ్రైవ్ చేయడం సరికాదన్నారు. ఈ ఎన్సీసీ కంబైండ్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసిన సందర్భంలోనే తప్పకుండా హెల్మెట్ కొనాలని, హెల్మెట్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు నడపరాదని సూచించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. 18ఏళ్ల తరువాత వాహనం నడిపే ప్రతి ఒక్కరు లైసెన్స్ తీసుకోవాలని కోరారు. రూల్స్ అతిక్రమించి వాహనాలు నడిపినప్పుడు మైనర్ తో పాటు వాహనం యజమాని పై కేసు నమోదు చేస్తామన్నారు. మద్యపానం సేవించి నడపడం వలన ప్రమాదం తీవ్రత ఎక్కువ ఉంటుందన్నారు. మద్యపానం చేసిన తర్వాత వాహనాలు నడపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ రామ్ హరి ఎఎన్ఓ, లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్ మహేందర్ రెడ్డి, ఎన్సీసీ క్యాడేట్స్, తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుంది

- జస్ట్ మీరు ట్రస్ట్ సహాయంతో కాజీపూర్‌లో వైద్య పరీక్షలు
- జనవాణి డైరెక్టర్ ప్రతాప్





నవతెలంగాణ-మిరుదొడ్డి

పేదలకు ఆరోగ్యం పట్ల సేవలు చేయడంలో ఎంతో సంతృప్తిగా ఉంటుందని జెస్ మేరీ ట్రస్ట్ సహాయంతో ప్రజలకు హెల్త్ క్యాంపును నిర్వహి ంచామని జనవాణి డైరెక్టర్ ప్రతాప్ అన్నారు. హెల్త్ క్యాంపులో 342 మంది పాల్గొని రక్త పరీక్షలు అన్ని రకాలు, అదేవిధంగా ఈసీజీ పరీక్షలు అన్ని రకాల టెస్టులు నిర్వహించారు. 100 మంది పైగా అద్దాలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ.. అక్బర్ పేట- భూంపల్లి మండలం ఖాజీపూర్ గ్రామంలో జైస్ మేరీ ట్రస్ట్ సహకారంతో జనవాని నిర్వహించిన ప్రజా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగిందన్నారు. పేద ప్రజలకు సేవ చేస్తే ఎంతో మేలు కలుగుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించడానికి జస్ట్ మేరీ ట్రస్ట్ అండగా ఉంటుందని అన్నారు. దీంట్లో గ్రామ ప్రజలు యువకులు పాల్గొని వాలంటరీగా పని చేయడం జరిగిందన్నారు. ఈ హెల్త్ క్యాంపు ఉద్దేశించి ప్రజలకు కొన్ని ప్రికాషన్స్ అందించారు. మనం ఆరోగ్యం కాపాడు కోవాలంటే మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఎలాంటివి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పట్టభద్రుల భవిష్యత్తు కోసం పనిచేస్తా



- నిరుద్యోగుల ఆమస్యలపై ప్రతినిత్యం పోరాడుతా
- పట్లోళ్ల రాఘవేందర్ రెడ్డి

నవతెలంగాణ- జగదేవపూర్

పట్టభద్రుల భవిష్యత్తు కోసం పనిచేస్తా, నిరుద్యోగుల ఆమస్యలపై ప్రతినిత్యం పోరాడుతా అని, మెదక్, కరీంనగర్, నిజామాబాదు,అదిలాబాద్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ట్రస్మ రాష్ట్ర కోశాధికారి జగదేవపూర్ ది మాస్టర్ మైండ్ పాఠశాల కరస్పాండెంట్ రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. జగదేవపూర్ మండల కేంద్రంలో నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలల యజమాన్యంతో కలిసి శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న రాఘవేందర్ రెడ్డి కి మా మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయే గ్రాడ్యుయేషన్ ఎన్నికల్లో ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్నామన్నారు. పట్టభద్రులు తమ ఓటు ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను భారీ మెజారిటీతో గెలిపించినట్లైతే మీ ఋణం తీర్చుకొనేందుకు నేను సిద్ధంగా ఉన్న అని అన్నారు. నిరుద్యోగులకు నా వంతుగా తప్పకుండా కృషి చేస్తా అని తెలిపారు. నిరుద్యోగులకు గతంలో జరగని విధంగా కృషి చేస్తా అని తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై కృషి చేస్తా అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రవేటు పాఠశాలల యాజమాన్య చంటి, కరుణాకర్ రెడ్డి, రామస్వామి, మహేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధిపై ఆలోచన చేయట్లేదు

- బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్



నవతెలంగాణ-మిరుదొడ్డి

రాష్ట్ర అభివృద్ధి పై ఆలోచించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నియంత పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా అక్బర్పేట బొంపల్లి మండలం మోతే గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దుబ్బాక నియోజకవర్గం అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కాన్వాయ్ వెళ్తున్న సమయంలో కాంగ్రెస్ శ్రేణులు గుడ్లతో దాడికి తీయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన హామీలు అమలు చేతకాక ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.